

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 342 | హైదరాబాద్ | బుధవారం | 20-05-2026 | పేజీలు: 08


# త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాల వైభవం

భక్తుల కోసం టీజీఆర్టీసీ, వైద్యారోగ్య శాఖల బృహత్తర ఏర్పాట్లు
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వేడుకలకు సిద్ధం
ఈ నెల 21 నుండి జూన్ 1 వరకు ఆధ్యాత్మిక సంబరం
రాష్ట్రవ్యాప్తంగా 3,360 ప్రత్యేక బస్సులు
సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనపు వసూలుకు నిర్ణయం
'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు యథావిధిగా ప్రయాణాలు
వేడుకలకు రావాలంటూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంకు ఆహ్వానం
కంచి పీఠాధిపతి చేతుల మీదుగా పుణ్యస్నానాల ప్రారంభం
12 రోజుల పాటు ఘనంగా వేడుకలు
30 నుండి 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలోనే అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి సన్నిధిలో జరగనున్న సరస్వతి నది అంత్య పుష్కరాలకు సర్వం సిద్ధమైంది. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదుల పవిత్ర కలయిక అయిన త్రివేణి సంగమ స్థలంలో ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు అత్యంత వైభవంగా ఈ అంత్య పుష్కర వేడుకలు జరగనున్నాయి. ఈ సుదీర్ఘ ఆధ్యాత్మిక సంబరానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి రవాణా ఇబ్బందులు, అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) ..మిగతా 2లో





# లారీలు రావు.. ధాన్యం పోదు..!

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాలు నిలిపివేత
కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి కాకపోవడంతో సమస్య
అకాల వర్షా ల భయంతో రైతుల్లో ఆందోళన
పంట కాపాడుకోవడం కంటే అమ్ముకోవడమే కష్టమంటున్న రైతులు
ప్రభుత్వం, అధికారుల హామీలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపణలు
వెంటనే ధాన్యం తరలింపు, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రైతుల డిమాండ్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటను కాపాడేందుకు రైతులు పడుతున్న ఇబ్బందుల కంటే, ధాన్యాన్ని అమ్ముకునేందుకే ఎక్కువ కష్టాలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి కాకపోవడంతో తూకాలు నిలిపివేశారు. దీంతో అకాల వర్షాలు వస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదని ఆరోపణలు ..మిగతా 2లో



# ఈనెల 21న తెలంగాణ కేబినెట్ సమావేశం

ఈనెల 21న మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ భేటీ
శాఖలకు సీఎస్ కీలక ఆదేశాలు జారీ
ఎజెండా అంశాలు మంగళవారం సాయంత్రంలోగా సమర్పించాలి
అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి (కేబినెట్) సమావేశానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 21వ తేదీన (గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని సమావేశ మందిరంలో కేబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అన్ని ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు , కార్యదర్శులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఈ సమావేశంలో చర్చించాల్సిన ఎజెండా అంశాలను, వాటి పక్కా ..మిగతా 3లో

# తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త

ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి 44 ఏళ్లకు పెంపు
రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం
పోటీ పరీక్షల అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వ భారీ ఊరట
34 నుంచి 44 ఏళ్లకు గరిష్ఠ వయోపరిమితి పెంపు
రాష్ట్ర ప్రభుత్వ తాజా ఉత్తర్వులు ఏడాది పాటు అమలు
అధికారిక జీవో జారీ చేసిన సచివాలయం
యూనిఫామ్ సర్వీసులకు మినహాయింపు
పోలీసు ఉద్యోగాలకు వయో సడలింపు వర్తించదన్న స్పష్టత
తెలంగాణ నిరుద్యోగుల సుదీర్ఘ అభ్యర్థనలకు లభించిన మోక్షం
గడువు ముగియడంతో మరోమారు పొడిగింపు
ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మిన్నంటిన సంబరాలు
సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో కొలువుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తూ, తీవ్రమైన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీపి కబురు అందించింది. సుదీర్ఘ కాలంగా ఉద్యోగ నోటిఫికేషన్లు రాక, వయస్సు దాటిపోతూ తీవ్ర ఆందోళనలో ఉన్న అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన గరిష్ఠ వయో పరిమితిని ఏకంగా పదేళ్ల పాటు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక సాహసోపేతమైన, చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని తీసుకుంది. సాధారణ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వ కొలువులకు దరఖాస్తు చేసుకునేందుకు ఉన్న 34 సంవత్సరాల గరిష్ఠ వయో పరిమితిని ఏకంగా 44 సంవత్సరాలకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర సచివాలయం మంగళవారం అత్యంత కీలకమైన జీవోను విడుదల చేసింది. ఈ నూతన సడలింపు ఉత్తర్వులు ప్రస్తుత ..మిగతా 2లో

# ప్రజలపై ఇంధన ధరల భారం

మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నిప్పులు
'ఇన్‌ఫ్లేషన్ మ్యాన్' అంటూ ఖర్గే తీవ్ర విమర్శలు
దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం పూర్తిగా కేంద్ర పాలకుల సృష్టే
కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు
సామాన్య ప్రజలపై వరుస ఇంధన ధరల బాదుడు
చమురు కొనుగోలు కోసం మోదీ ప్రాధేయపడ్డారని ఆరోపణ
నాలుగు రోజుల్లోనే భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు
కుదేలవుతున్న సామాన్యుడి బడ్జెట్
విశ్వగురువు ప్రచారాలు పక్కనపెట్టాలి
మోదీ ప్రచార ఆర్భాటాలపై ఖర్గే ఘాటైన వ్యంగ్యాస్త్రాలు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం మరోసారి అడ్డగోలుగా పెంచడంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం అత్యంత తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితిని కుదిపేస్తున్న ఈ సంక్షోభం సహజసిద్ధంగా వచ్చింది కాదని, ఇది ముమ్మాటికీ నరేంద్ర మోదీ ప్రభుత్వం తన తప్పుడు విధానాల ద్వారా స్వయంగా ..మిగతా 2లో

# కృష్ణా బోర్డు సమావేశం మరోసారి వాయిదా

తెలంగాణ కేబినెట్ భేటీ నేపథ్యంలో నిర్ణయం
ఈ నెల 21న జరగాల్సిన సమావేశం నిలిపివేత
నదీ జలాల పంపిణీ, ప్రాజెక్టుల నిర్వహణపై చర్చ వాయిదా
రెండు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చిన కేఆర్ఎంబీ
కొత్త తేదీ త్వరలో ప్రకటిస్తామని స్పష్టం
కృష్ణా జలాల వివాద పరిష్కారంపై మళ్లీ జాప్యం
బోర్డు నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో చర్చ




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కృష్ణా నదీ జలాల పంపిణీ, ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగం వంటి కీలక అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈ సమావేశాన్ని తొలుత ఈ నెల 14వ తేదీన నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. అయితే అదే రోజు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ ..మిగతా 2లో

# దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం

అదానీ, అంబానీలపై ప్రభావం ఉండదన్న రాహుల్
యువత, రైతులు, చిన్న వ్యాపారులే నష్టపోతారన్న వ్యాఖ్య
రాయ్‌బరేలీ పర్యటనలో మీడియాతో కాంగ్రెస్ నేత మాటామంతీ
ప్రధాని మోదీ పొదుపు పిలుపుపై విమర్శలు
విదేశాలకు వెళ్లొద్దని చెప్పి తానే ప్రపంచ పర్యటనలంటూ ఎద్దేవా
దేశ ఆర్థిక విధానాలపై కేంద్రాన్ని నిలదీసిన రాహుల్
ఉద్యోగాలు, వ్యవసాయం, చిన్న పరిశ్రమలు ప్రమాదంలోనన్న ఆందోళన
కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందన్న స్పష్టం



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే దిశగా వెళ్తోందని కాంగ్రెస్ అగ్రనేత Rahul Gandhi ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో దేశ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా చూడని స్థాయిలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ..మిగతా 3లో

# లారీలు రావు.. ధాన్యం పోదు..!

మొదటిపేజీ తరువాయి

వినిపిస్తున్నాయి.

**లారీలు రాక తూకం నిలిపివేత..!**

సుమారు నెల రోజుల క్రితం ప్రారంభమైన సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నేటి వరకు కేవలం 43 లారీల ధాన్యాన్ని మాత్రమే తూకం వేసి మిల్లులకు తరలించారు. అయితే, సదరు ధాన్యం సమయానికి దిగుమతి కాకపోవడంతో మంగళవారం లారీలు రాక తూకాలను నిలిపివేశారు. ఇప్పటికీ కేవలం 50 శాతం ధాన్యమే తూకం వేసినట్లు తెలుస్తోంది. ఇంకా కొనుగోలు కేంద్రాలకు రావాల్సిన ధాన్యం రైతుల కల్లాల్లోనే ఉన్నట్లు సమాచారం. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సరిపడా స్థలాలు లేక కొనుగోలు కేంద్రాలకు తీసుకురాలేకపోతున్నామని చెబుతున్నారు. కేవలం 50 శాతం ధాన్యంతోనే దిగుమతుల్లో అంతరాయం ఏర్పడితే, పూర్తిస్థాయి ధాన్యం దిగుమతిలో ఎన్ని అవాంతరాలు ఎదురవుతాయో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అకాల వర్షం వస్తే పరిస్థితి ఏంటి..?**

ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు త్వరలోనే వచ్చే అవకాశం ఉందని, దాని ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో గుబులు మొదలైంది. ధాన్యం దిగుమతిలో జాప్యం, తూకాల్లో ఆలస్యం కారణంగా తమ ధాన్యం అకాల వర్షాలకు నేలపాలవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ అకాల వర్షం వస్తే ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారా అనే ప్రశ్న రైతుల్లో తలెత్తుతోంది. ప్రస్తుతం ధాన్య రాశులను రక్షించేందుకు ఉపయోగించే టార్పాలిన్లు కూడా కొనుగోలు కేంద్రాల్లో తగినంతగా లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

**నాసిరకం గోనె సంచులతో తిప్పలు..!**

ఇదంతా ఒక ఎత్తయితే, వరి ధాన్యం తూకం వేయడానికి ఉపయోగిస్తున్న గోనె సంచుల నాణ్యత కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. పూర్తిగా పాడైపోయి, భారీ రంధ్రాలు ఉన్న పాత గోనె సంచులు సరఫరా కావడంతో ధాన్యాన్ని తూకం వేసి లారీల్లోకి తరలించేందుకు హమాలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి 10 వేలకుపైగా గోనె సంచులు సరఫరా చేసినప్పటికీ, అందులో కేవలం 4 వేల బస్తాలే ధాన్యం తూకం వేయడానికి అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ఇకనైనా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ధాన్యం దిగుమతి త్వరగా జరిగేలా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



# తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి

అధికారిక జారీ తేదీ నుండి రాబోయే ఒక సంవత్సరం పాటు పూర్తిస్థాయిలో అమల్లో ఉంటాయని ప్రభుత్వం ఆ జీవోలో స్పష్టంగా పొందుపరిచింది. అయితే ఈ వయోపరిమితి సడలింపు అనేది కేవలం సాధారణ సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తుందని, పోలీస్, ఎక్సైజ్, జైళ్లు మరియు అగ్నిమాపక శాఖల వంటి రక్షణ రంగానికి చెందిన 'యూనిఫామ్ సర్వీసుల' ఉద్యోగాలకు ఈ 44 ఏళ్ల సడలింపు నిబంధన ఎంతమాత్రం వర్తించదని ప్రభుత్వం ప్రాథమికంగానే స్పష్టం చేసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తొలినాళ్లలో నిరుద్యోగుల అభ్యర్థనల మేరకు గరిష్ఠ వయోపరిమితిని మొదట పదేళ్ల పాటు సడలించగా, ఆ తర్వాత ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఆ గడువును మరో రెండేళ్ల పాటు పొడిగించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆ పొడిగింపు గడువు కూడా పూర్తిగా ముగిసిపోవడంతో, రాష్ట్రంలోని నిరుద్యోగ జేఏసీలు, సీనియర్ అభ్యర్థులు తమకు న్యాయం చేయాలంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పెద్ద ఎత్తున విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల విజ్ఞప్తులలోని న్యాయాన్ని, వారి వయస్సు రీత్యా ఎదుర్కొంటున్న మానసిక ఆందోళనలను సహానుభూతితో అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి, కాలపరిమితిని మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఈ అద్భుతమైన జీవోను క్షేత్రస్థాయిలోకి తీసుకువచ్చారు.

యావత్ భారతదేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా, కేవలం తెలంగాణలోనే నిరుద్యోగ అభ్యర్థుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వ ఉద్యోగాల దరఖాస్తుకు గరిష్ఠ వయో పరిమితిని 44 సంవత్సరాలకు పెంచడాన్ని హర్షిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సముదాయం నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతగా ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) వేదికగా మంగళవారం నిరుద్యోగులు, విద్యార్థి శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నిరుద్యోగ జేఏసీ ముఖ్య ప్రతినిధి డాక్టర్ కోటూరి మానవతారాయ్ నేతృత్వంలో ఓయూ క్యాంపస్‌లో వందలాది మంది అభ్యర్థులు ఒకచోటకు చేరి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి అత్యంత వైభవంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో డాక్టర్ కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ, నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకునే నిజమైన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉందనడానికి ఈ వయోపరిమితి పెంపు జీవోనే నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో ఎలాంటి న్యాయపరమైన కోర్టు చిక్కులు తలెత్తకుండా, అత్యంత పారదర్శకమైన పద్ధతిలో సుమారు 40 వేల కొత్త ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సకల సన్నద్ధతతో కూడిన వేగవంతమైన కసరత్తు చేస్తోందని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

ఇదే క్రమంలో నిరుద్యోగ అభ్యర్థులను తప్పుదోవ పట్టించే కొన్ని శక్తుల తీరుపై డాక్టర్ మానవతా రాయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం సానుకూలంగా స్పందిస్తూ అడుగులు వేస్తుంటే, కొంతమంది వ్యక్తులు తమ స్వంత రాజకీయ ప్రయోజనాల కోసం, కార్పొరేట్ కోచింగ్ సెంటర్ల ఆర్థిక ప్రయోజనాల కోసం కృత్రిమ నిరుద్యోగ నాయకుల అవతారమెత్తారని సంచలన ఆరోపణలు చేశారు. నిరంతరం ధర్నాలు, ఆందోళనల పేరిట ప్రభుత్వంపై బురదజల్లుతూ పబ్బం గడుపుకోవాలని చూసే అలాంటి స్వార్థపూరిత నకిలీ నాయకుల ఉచ్చులో అసలైన, కష్టపడి చదువుకునే నిరుద్యోగ అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ పడొద్దని ఆయన హితవు పలికారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పదేళ్ల వయోసడలింపు సువర్ణావకాశాన్ని అభ్యర్థులంతా సద్వినియోగం చేసుకుని, ప్రశాంతమైన వాతావరణంలో ఉద్యోగ సాధనే లక్ష్యంగా శ్రమించాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక విజయ ఉత్సవ కార్యక్రమంలో టీపీసీసీ ముఖ్య నాయకులు కొప్పుల ప్రతాప్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అగ్ర నాయకులు రాథోడ్ రవీంద్ర నాయక్, నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు జగన్నాథ్ యాదవ్, అశోక్, హేమంత్ చౌదరి, నాగార్జున, దేవ్ లాల్‌తో పాటు వేలాది మంది పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి పూర్తి మద్దతు ప్రకటించారు.

# కృష్ణా బోర్డు సమావేశం మరోసారి వాయిదా

మొదటిపేజీ తరువాయి




సమావేశం ఉండటంతో ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు భేటీని ఈ నెల 21వ తేదీకి వాయిదా వేశారు. కానీ తాజాగా ఈ నెల 21న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించడంతో మరోసారి సమావేశం నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా బోర్డును కోరింది. రాష్ట్ర విజ్ఞప్తిని పరిశీలించిన కృష్ణా బోర్డు సమావేశాన్ని మరోసారి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు సమావేశం వాయిదాపై రెండు తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సమాచారం అందించింది. తదుపరి సమావేశ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని బోర్డు స్పష్టం చేసింది. దీంతో కృష్ణా జలాల అంశంపై జరుగాల్సిన కీలక చర్చలు మరోసారి ఆలస్యమయ్యాయి. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశం రెండు రాష్ట్రాల మధ్య చాలా కాలంగా వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కృష్ణా బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగ హక్కులు, విద్యుత్ ఉత్పత్తి, నీటి విడుదలలు వంటి అంశాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కేఆర్ఎంబీ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతి సమావేశంలోనూ శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగ లెక్కలు, బ్యాక్‌వాటర్ వినియోగం, కొత్త ప్రాజెక్టుల అనుమతులు, డ్రాయింగ్ పరిమితులు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వస్తుంటాయి. ముఖ్యంగా నీటి కొరత పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు నెలకొనే అవకాశం ఉండటంతో బోర్డు సమావేశాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

ఇటీవల కాలంలో కృష్ణా జలాల కేటాయింపుల విషయంలో రెండు రాష్ట్రాలు తమ తమ వాదనలను బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులకు అనుగుణంగా నీటి వాటా అమలు కావాలని కోరుతుండగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే సాగు అవసరాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగం కొనసాగిస్తున్నట్లు చెబుతోంది. ఈ క్రమంలో బోర్డు సమావేశం ద్వారా కొన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని భావించారు. అయితే వరుస వాయిదాలతో సమస్యల పరిష్కారం మరింత ఆలస్యమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభానికి ముందు నీటి నిర్వహణపై స్పష్టత అవసరమని నీటిపారుదల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రాజెక్టుల వద్ద నీటి నిల్వలు, సాగునీటి అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి అవసరాలపై ముందస్తు ప్రణాళిక అవసరమని చెబుతున్నారు. కేఆర్ఎంబీ సమావేశం వాయిదా పడటం రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. రెండు రాష్ట్రాల్లోనూ మంత్రివర్గ సమావేశాల కారణంగా కీలక భేటీ వాయిదా పడటం పరిపాలనా సమన్వయ లోపానికి సంకేతమని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు సమావేశానికి సిద్ధమవుతున్న సమయంలో వాయిదా నిర్ణయం రావడం చర్చకు దారితీసింది.

ఇక కృష్ణా జలాల అంశం సుప్రీంకోర్టు, ట్రైబ్యునల్ పరిధిలోనూ కొనసాగుతుండటంతో బోర్డు సమావేశాలపై ప్రత్యేక దృష్టి నెలకొంది. భవిష్యత్‌లో నీటి పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు కేఆర్ఎంబీ తదుపరి సమావేశ తేదీ ఎప్పుడు నిర్ణయిస్తుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది. త్వరలోనే కొత్త తేదీ ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అప్పటివరకు కృష్ణా జలాలపై ఉన్న కీలక నిర్ణయాలు మరికొంత కాలం పెండింగ్‌లోనే ఉండనున్నాయి.

# త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాల వైభవం

మొదటిపేజీ తరువాయి

పటిష్టమైన చర్యలు చేపట్టిందని వరంగల్ రీజనల్ మేనేజర్ భవానీ ప్రసాద్ అధికారికంగా వెల్లడించారు. భక్తుల రద్దీని తట్టుకునేలా భారీ ఎత్తున ప్రత్యేక బస్సు సర్వీసులను నడపడానికి కొత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రత్యేక ఏర్పాట్లలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్ 1, వరంగల్ 2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు మరియు మహబూబాబాద్ వంటి ప్రధాన డిపోల నుండి కాళేశ్వర క్షేత్రానికి నేరుగా 59 ప్రత్యేక బస్సులను కేటాయించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద రవాణా కేంద్రమైన హనుమకొండ ప్రధాన బస్టాండును బేస్ పాయింట్‌గా చేసుకుని అక్కడి నుండి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నిరంతరాయంగా మరిన్ని అదనపు సర్వీసులను నడపనున్నారు.

ఈ పుష్కరాల ప్రత్యేక రవాణా వ్యూహంలో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ ముఖ్య పట్టణాల నుండి కాళేశ్వరానికి మొత్తం 3,360 ప్రత్యేక బస్సులను రంగంలోకి దించుతోంది. భక్తులను సురక్షితంగా పుణ్యక్షేత్రానికి చేర్చేందుకు వీలుగా ఈ బస్సుల ద్వారా ఏకంగా 5,772 ప్రత్యేక ట్రిప్పులను నడపాలని రవాణా అధికారులు నిర్ణయించారు. అయితే ఈ ప్రత్యేక ఆపరేషన్ల నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని, పుష్కరాల సమయంలో నడిచే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు సాధారణ రోజుల్లో ఉండే ఛార్జీల కంటే 50 శాతం అదనపు ముక్కుపిండి వసూలు చేయనున్నట్లు రవాణా సంస్థ స్పష్టం చేసింది. ఈ అదనపు ఛార్జీల విధింపు కేవలం ప్రత్యేక సర్వీసులకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ఈ పుష్కరాల సమయంలోనూ యథావిధిగా వర్తిస్తుందని ఆర్టీసీ అధికారులు స్పష్టమైన ప్రకటన చేశారు. అర్హులైన మహిళా ప్రయాణికులు, బాలికలు ఎటువంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేకుండానే మహాలక్ష్మి పథకం ద్వారా ఈ పవిత్ర పుష్కరాలకు ఉచితంగా ప్రయాణించి పుణ్యస్నానాలు ఆచరించవచ్చని, మహిళా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, కండక్టర్ల కేటాయింపు వంటి రక్షణ చర్యలు కూడా చేపడుతున్నట్లు యాజమాన్యం వివరించింది.

మహదేవపూర్ మండల పరిధిలోని కాళేశ్వర క్షేత్రంలో మే 21న అత్యంత శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్న ఈ సరస్వతి నది అంత్య పుష్కరాల ప్రారంభోత్సవ వేడుకలకు హాజరు కావాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ డైరెక్టర్ హనుమంతరావులతో కలిసి అధికారికంగా ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో వారికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ పుష్కరాల ఏర్పాట్లపై తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కే.రామకృష్ణా రావు ఆధ్వర్యంలో ఇటీవల ఒక ఉన్నత స్థాయి సమగ్ర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షలో పాల్గొన్న ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీ తెల్లవారుజామున 5 గంటల 43 నిమిషాల శుభ ముహూర్తానికి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారు త్రివేణి సంగమంలో ప్రథమ పుణ్యస్నానం ఆచరించి ఈ అంత్య పుష్కరాలను అధికారికంగా ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి వేసవి కాలం ముగింపు దశలో వస్తున్నందున మరియు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనలు పెరిగినందున, ఈ 12 రోజుల వ్యవధిలో దాదాపు 30 లక్షల నుండి 40 లక్షల మంది వరకు భక్తులు కాళేశ్వరానికి తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఆ స్థాయి రద్దీకి తగ్గట్టుగా శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీల భద్రతను పర్యవేక్షించాలని అధికారులను కోరారు. భక్తుల రద్దీ ఊహించని స్థాయిలో ఉండే అవకాశం ఉన్నందున, ఘాట్ల వద్ద మరియు దేవాలయ పరిసరాల్లో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ 12 రోజుల పాటు ప్రతిరోజూ దేశంలోని ఒక ప్రముఖ ఆధ్యాత్మిక పీఠానికి చెందిన స్వామీజీ లేదా పీఠాధిపతులు ఈ పుష్కరాల్లో పాల్గొని నదీ తీరాన పుణ్యస్నానాలు ఆచరిస్తారని, వారి ఆధ్వర్యంలో భక్తులకు ఆశీర్వచనాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం వేళల్లో నదీ దేవతలకు, ముక్తేశ్వరుడికి ప్రత్యేక హోమాలు, జపాలు నిర్వహిస్తారని, అలాగే సాయంత్రం వేళల్లో భక్తులను అలరించేందుకు ప్రత్యేక సాంస్కృతిక, భక్తి సంగీత కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూన్ 1వ తేదీన ముగియనున్న ఈ వేడుకలకు తాగునీటి సరఫరా, నిరంతర పారిశుధ్య నిర్వహణ (శానిటేషన్), ట్రాఫిక్ నియంత్రణ మరియు రవాణా సౌకర్యాలను పకడ్బందీగా అమలు చేయాలని సీఎస్ రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, ఉన్నతాధికారులు ముకుంద్ రెడ్డి, అనితా రామచంద్రన్, హరీశ్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని తమ శాఖల తరపున తీసుకుంటున్న ముందస్తు చర్యలను వివరించారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కాళేశ్వరం త్రివేణి సంగమ తీరంలో ఒక సమగ్రమైన వైద్య నిఘా మరియు అత్యవసర సేవల ప్రణాళికను సిద్ధం చేసింది. ఎండ తీవ్రత, నదీ స్నానాల సమయంలో జరిగే ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర ఆరోగ్య పరిస్థితులను తక్షణమే ఎదుర్కొనేందుకు వీలుగా పుష్కర పరిసర ప్రాంతాలలో మొత్తం 16 అత్యాధునిక వైద్య శిబిరాలను (మెడికల్ క్యాంపులు) ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాల్లో నిరంతరం సేవలు అందించేందుకు 576 మంది సుశిక్షితులైన పారామెడికల్, నర్సింగ్ సిబ్బందితో పాటు 18 మంది ప్రత్యేక వైద్య నిపుణులను (స్పెషలిస్ట్ డాక్టర్లు) రంగంలోకి దించారు. భక్తులకు సులభంగా అందుబాటులో ఉండేలా ఘాట్ ప్రధాన క్యాంప్, కాళేశ్వరం పీహెచ్‌సీ ప్రధాన క్యాంప్, పాత ఈవో కార్యాలయం, దేవాలయ ప్రధాన ద్వారం, పార్కింగ్ ఏరియా 1, ప్రత్యేకంగా నిర్మించిన టెంట్ సిటీ, పార్కింగ్ ఏరియా 2, తాత్కాలిక బస్టాండ్, పాత బస్టాండ్, గోదావరి ప్రధాన ఘాట్, హరిత హోటల్ ప్రాంగణం, సరస్వతీ ఘాట్ నదీ తీరం, గంగారపు క్రాస్ రోడ్స్, అన్నారం కెనాల్ ప్రాంతం మరియు కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ వైద్య శిబిరాలను విస్తరించారు. అత్యవసర ఔషధాల నిల్వ కోసం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక స్టోరేజ్ గదులను కేటాయించడమే కాకుండా, విధుల్లో పాల్గొనే వైద్య సిబ్బందికి అక్కడే వసతి సౌకర్యాలను కల్పించారు. ఇరవై నాలుగు గంటల పాటు అందుబాటులో ఉండేలా అంబులెన్స్ సేవలను కూడా ఘాట్ల వద్ద సిద్ధంగా ఉంచారు.

# ప్రజలపై ఇంధన ధరల భారం

మొదటిపేజీ తరువాయి

సృష్టించిన సంక్షోభమేనని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఘాటుగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన పరిపాలనా వైఫల్యాలన్నింటినీ కప్పిపుచ్చుకుంటూ, ఆ వైఫల్యాల తాలూకు ఆర్థిక భారాన్ని నిస్సహాయులైన సామాన్య పౌరులపై మోపుతోందని ఆయన ఆరోపించారు. ఒకవైపు దేశ సంపదను సృష్టిస్తున్న సామాన్యుడిని నిలువునా దోచుకుంటూ, మరోవైపు పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు, సంపన్నులకు మాత్రం వేల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తూ లబ్ధి చేకూరుస్తున్నారని మండిపడ్డారు. అంతర్జాతీయ వేదికలపై తానే ఒక గొప్ప ప్రపంచ నాయకుడినని ప్రచారం చేసుకునే ప్రధాని మోదీ, రష్యా నుంచి చౌక ధరకే లభించే ముడి చమురును కొనుగోలు చేసేందుకు వీలుగా అమెరికా ప్రభుత్వం ముందు మోకరిల్లారని, తమకు మరో నెల రోజుల పాటు గడువు మినహాయింపు ఇవ్వాలంటూ అమెరికాను వేడుకున్నారని ఖర్గే ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సంచలన ఆరోపణలు చేశారు. కేవలం నాలుగు రోజుల క్రితమే ఇంధన ధరలను విపరీతంగా పెంచి, ఆ దెబ్బ నుంచి ప్రజలు కోలుకోకముందే మళ్లీ ధరలను పెంచడం కేంద్ర పాలకుల క్రూరత్వానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారీ ఇలా అంతర్జాతీయ శక్తుల ముందు దేశ పరువును తాకట్టు పెట్టడం ద్వారా 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవాన్ని ప్రధాని దెబ్బతీస్తున్నారని, భారతదేశ చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతటి దిగజారిన స్థాయికి వెళ్లలేదని ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

సముద్ర మార్గంలో నిలిచిపోయిన రష్యన్ చమురు రవాణా మరియు కొనుగోళ్లకు సంబంధించి అమెరికా ప్రభుత్వం మన దేశానికి మరో 30 రోజుల పాటు ప్రత్యేక మినహాయింపు ఇచ్చిందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రచారం చేసుకుంటున్నప్పుడు, మరి దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు పెంచాల్సి వస్తోందో సమాధానం చెప్పాలని ఖర్గే నిలదీశారు. బీజేపీ ప్రభుత్వానికి కనీస ముందుచూపు లేదని, దేశాన్ని నడిపించడంలో వారి నాయకత్వ లోపం ఈ సంక్షోభంతో స్పష్టంగా బహిర్గతమైందని విమర్శించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఇంధన ధరల పెంపు అనేది ప్రజల సంక్షేమం కోసం కాదని, ఇది సామాన్యులను చట్టబద్ధంగా దోచుకోవడానికి కేంద్రం సృష్టించిన ఒక పెద్ద పద్ధతిగా మారిందని ఆరోపించారు. దేశం ఇంతటి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే, ప్రధాని మరియు ఆయన క్యాబినెట్ మాత్రం ప్రజా సమస్యలను గాలికొదిలేసి నిరంతరం ఎన్నికల రాజకీయాలు, ప్రచారాల్లో మునిగితేలుతున్నారని ధ్వజమెత్తారు. విపక్షాలు అడుగుతున్న అస్తిత్వ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం పారిపోతోందని, కేవలం విదేశీ గడ్డలపై భారీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించినంత మాత్రాన ఎవరూ 'విశ్వగురువు' కాలేరని ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచిస్తూ, "మీరు మామిడిపండ్లు ఎలా తింటారు, మీ ఆరోగ్యం కోసం ఏ టానిక్ తాగుతారు అనే విషయాలపై దేశ ప్రజలకు ఎలాంటి ఆసక్తి లేదు; దేశాన్ని వేధిస్తున్న ఈ ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడానికి మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏంటో ప్రజలకు ముఖ్యం" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. అప్పుడే మిమ్మల్ని ప్రజలు నిజమైన 'ప్రధాన సేవక్'గా గుర్తిస్తారని, లేకపోతే కేవలం ప్రచారాలకే పరిమితమైన ఒక సాధారణ నాయకుడిగా చరిత్రలో మిగిలిపోతారని ఖర్గే హెచ్చరించారు.

ఇదే తరుణంలో కాంగ్రెస్ పార్టీ అధికారికంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రధాని నరేంద్ర మోదీని 'ఇన్‌ఫ్లేషన్ మ్యాన్' (ద్రవ్యోల్బణ పురుషుడు) గా అభివర్ణించింది. దేశంలో ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రజలపై భారాలు మోపడం ప్రారంభించారని కాంగ్రెస్ తన సామాజిక మాధ్యమాలలో ఆరోపించింది. వరుసగా ఇంధన ధరలను పెంచుకుంటూ పోవడం వల్ల నిత్యావసర వస్తువుల రవాణా ఖర్చులు పెరిగి, మార్కెట్లో ప్రతి వస్తువు ధర సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకుంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. గత నాలుగు రోజుల వ్యవధిలోనే లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలపై దాదాపు నాలుగు రూపాయల వరకు అదనపు భారం పడిందని, ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని కాంగ్రెస్ పేర్కొంది. ఎన్నికలు ముగిశాయి కాబట్టి ఇకపై ప్రజల నుంచి మరింత పన్నుల రూపంలో డబ్బును గుంజడానికి ఈ 'ఇన్‌ఫ్లేషన్ మ్యాన్' వెనుకాడబోరని విమర్శించింది. మరోవైపు, పశ్చిమాసియాలో చోటుచేసుకున్న తీవ్ర భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు ప్రస్తుతం తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్త చమురు సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, దేశీయంగా లీటరుకు సగటున 90 పైసల చొప్పున ధరలను పెంచారు. అయితే అంతకుముందు మే 15వ తేదీనే దేశవ్యాప్తంగా లీటరుకు ఏకంగా 3 రూపాయల చొప్పున భారీగా ధరలను పెంచిన కేంద్రం, అంతలోనే మళ్లీ ధరలను సవరించడం సామాన్య మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను పూర్తిగా అస్తవ్యస్తం చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ నెపంతో దేశీయంగా పన్నుల దోపిడీని తీవ్రం చేయడాన్ని సహించేది లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది.





# దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం

మొదటిపేజీ తరువాయి

హెచ్చరించారు. ముఖ్యంగా యువత, రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి వర్గాలపైనే ఈ ప్రభావం తీవ్రంగా పడుతుందని పేర్కొన్నారు. అయితే దేశంలోని పెద్ద కార్పొరేట్ సంస్థలు, అదానీఅంబానీ వంటి పారిశ్రామిక వేత్తలపై మాత్రం పెద్దగా ప్రభావం ఉండదని వ్యాఖ్యానించారు.

రెండు రోజుల పర్యటనలో భాగంగా తన సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీకి చేరుకున్న రాహుల్ గాంధీ స్థానిక మీడియాతో మాట్లాడారు. దేశ ఆర్థిక పరిస్థితి రోజు రోజుకీ ఆందోళన కరంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలు సామాన్య ప్రజల జీవితాలను మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్నాయని ఆరోపించారు. ఉద్యోగావకాశాలు తగ్గిపోవడం, వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండటం, చిన్న వ్యాపారాలు నిలదొక్కుకోలేని పరిస్థితి నెలకొనడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు.

ప్రస్తుతం దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఒకవైపు కొద్దిమంది కార్పొరేట్ సంస్థలు భారీ లాభాలు ఆర్జిస్తుండగా.. మరోవైపు సామాన్య ప్రజలు రోజువారీ ఖర్చులు కూడా భరించలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విధానాల వల్ల పేదలు మరింత పేదలుగా మారుతుండగా.. ధనికులు మరింత ధనవంతులవుతున్నారని విమర్శించారు.

ప్రధాని Narendra Modi ఇటీవల ప్రజలకు చేసిన పొదుపు సూచనలపైనా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని, విదేశీ పర్యటనలను తగ్గించాలని ప్రధాని సూచిస్తుంటే.. ఆయనే తరచూ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఒక విధమైన సందేశం ఇచ్చి.. తాను మరో విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

దేశ యువత పరిస్థితి అత్యంత దారుణంగా మారుతోందని రాహుల్ అన్నారు. చదువులు పూర్తిచేసుకున్న యువకులకు సరైన ఉద్యోగాలు లభించడం లేదని, నిరుద్యోగం చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని పేర్కొన్నారు. చిన్న వ్యాపారులు జీఎస్టీ, పెరిగిన ధరలు, ఆర్థిక మందగమనం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు పంటలకు సరైన ధరలు లేక, అప్పుల భారం పెరిగి తీవ్ర ఆవేదనలో ఉన్నారని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ నేత విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయ అభివృద్ధి వంటి కీలక రంగాల్లో స్పష్టమైన ప్రణాళిక కనిపించడం లేదన్నారు.

ప్రస్తుతం దేశ ప్రజల్లో భయం, అనిశ్చితి పెరుగుతోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆర్థిక అస్థిరత వల్ల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, వారి సమస్య



లను దేశవ్యాప్తంగా ప్రస్తావిస్తూనే ఉంటామని తెలిపారు.

రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ప్రతిపక్షాలు ఇప్పటికే విమర్శలు గుప్పిస్తుండగా.. రాహుల్ చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## ఈనెల 21న తెలంగాణ కేబినెట్ సమావేశం

మొదటిపేజీ తరువాయి

తెలుగు అనువాదంతో కలిపి మంగళవారం సాయంత్రం 6 గంటల లోపు తప్పనిసరిగా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ స్పష్టం చేశారు. ఒకవేళ ఏ శాఖకైనా కేబినెట్ చర్చ పరిధిలోకి వచ్చే ఎజెండా అంశాలు లేకపోయినా.. ఆ వివరాలతో కూడిన 'నిల్' (NIL) నివేదికను కూడా నిర్దేశిత గడువులోగా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేబినెట్ సమావేశం జరిగే సమయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు , ప్రభుత్వ కార్యదర్శులందరూ ఏ ఒక్కరూ సెలవు పెట్టకుండా తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్ (కార్యాలయాల) లోనే అందుబాటులో ఉండాలని సీఎస్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో పలు కీలక నిర్ణయాలు, తాజా రాజకీయ, పరిపాలనాపరమైన అంశాలపై ఈ కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది.



## ఘట్‌కేసర్‌లో సమస్యలపై కమిషనర్ దృష్టి

- **పారిశుధ్యం, జనగణన, క్రీడా వసతులపై ఆదేశాలు**

**ఘట్‌కేసర్, మే 19(ప్రజా క్షేత్రం):**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాలను సందర్శించారు. పారిశుధ్య సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌లో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించిన కమిషనర్, వివరాల నమోదు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం శానిటరీ కార్మికులతో సమావేశమై, వారి భద్రతకు అవసరమైన సేఫ్టీ గేర్ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.ఎదులాబాద్ వార్డు ఊర్వెగడ్డ ప్లేగ్రౌండ్‌ను పరిశీలించిన ఆయన, క్రీడాకారులు, స్థానికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వాణి, డీఈ నరేష్, డీఈ శ్రీనివాస్, ఏఈఈ చంద్రశేఖర్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పద్మశాలిటౌన్‌షిప్‌లో తాగునీటి సమస్యపై జలమండలికి వినతి

**కాప్రా, మే 19(ప్రజా క్షేత్రం):**

కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్‌షిప్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జలమండలి అధికారులను కోరారు. టౌన్‌షిప్ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు. 132 ఎకరాల్లో విస్తరించిన టౌన్‌షిప్‌లో 2,400 కుటుంబాలు నివసిస్తున్నాయని, డంపింగ్ యార్డ్ సమీపంలో ఉండటంతో భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కలుషిత నీరు తాగడంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. టౌన్‌షిప్‌కు తక్షణమే శుద్ధి చేసిన తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని, అవసరమైతే కొత్త రిజర్వాయర్ నిర్మించాలని, యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్లు వేయాలని కోరారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని ఈడీ పంకజ హామీ ఇవ్వగా, కాలనీ ప్రతినిధులు పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## చెట్టుకు ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

- **సురంగల్ శివారులో ఘటన**
- **పోతుగల్ గ్రామంలో విషాదం**

**మొయినాబాద్,మే 19 (ప్రజాక్షేత్రం):**

ఓయువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోతుగల్ గ్రామానికి చెందిన వేమనూరి మల్లికార్జున్ రెడ్డి (24) అనే యువకుడు మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో సూరంగల్ గ్రామ శివారులోని కాశ్మీర్ ఫార్మ్ హౌస్ సమీపంలో ఒక చెట్టుకు త్రాడుతో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.మార్గమధ్యంలో వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.మృతుడి తల్లి వేమనూరి సునందా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొయినాబాద్



పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని,కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జేబీఐటీ కాలేజీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- **యువకుడు దుర్మరణం**

**మొయినాబాద్,మే 19(ప్రజాక్షేత్రం):**

మండల పరిధిలోని జేబీఐటీ కాలేజీ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలవగా,మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కాశింబౌలి గ్రామ నివాసి మాడి రంగారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ నెల 18న రాత్రి 9:00 గంటల సమయంలో ఆయన తమ్ముని కొడుకు శివశాంత్ రెడ్డి మరియు స్నేహితుడు తరుణ్ రెడ్డి ఇద్దరూ కలిసి క్రెటా కారులో మొయినాబాద్ నుండి కాశింబౌలి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్గమధ్యంలో జేబీఐటీ కాలేజీ వద్దకు రాగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పి కాలేజీ కాంపౌండ్ గోడను బలంగా ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నానక్రామ్‌గూడలోని అపోలో ఆసుపత్రికి తరలించారు.



అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి 11:00 గంటలకు శివశాంత్ రెడ్డి మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన తరుణ్ రెడ్డి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## వ్యవసాయా పనిముట్లు కొరకు ధరఖాస్తు చేసుకోండి.

- **మండల వ్యవసాయ అధికారి సుచరిత వెల్లడి**

**పెద్దకడుబూరు మే 19(ప్రజాక్షేత్రం):**

పెద్దకడబూరు మండల పరిధిలోనిరైతులకు విజ్ఞప్తి మేరకు ఎన్ ఐసిఎఫ్ఎం పోర్టల్ లో వ్యవసాయా యాంత్రీకరణ పథకం కింద వ్యవసాయా పనిముట్లు కొరకు ధరఖాస్తు చేసుకునే గడువు ను మరో ఐదు రోజుల ప్రభుత్వం పొడిగించడం జరిగిందని మండల వ్యవసాయాధికారిణి సుచరిత మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే రైతులు మండలంలోని రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకొని ఎన్ ఐసిఎఫ్ఎం పోర్టల్ లో ధరఖాస్తు లను నమోదు చేసుకోవాల్సిందిగా అమె రైతులను కోరారు.

## మోడల్ స్కూల్ లోతుకుంట ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు నోటిఫికేషన్

**వలిగొండ మే 19(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజ్ లోతుకుంట( వలిగొండ )లో ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ విడుదల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ డా " సీతారామరాజు తెలియజేసారు ఎంపీసీ, బైపిసి, సిఈసి, ఏ సి ఈ గ్రూపులలో ప్రవేశాలు స్వీకరించబడతాయాని. ప్రతి గ్రూపులో 40 సీట్లు కలవని, పదవ తరగతి ఫలితాల మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపులు జరుగుతాయని. తెలియజేశారు https://tgms.telangana.gov.in దరఖాస్తు చేయవచ్చని దరఖాస్తుకు ఎటువంటి ఫీజు లేదు. మొబైల్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చ ని ఇలాంటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. లాస్ట్ ఇయర్ ఇంటర్ ఫలితాలలో జిల్లా లో ప్రధమ స్థానం సాధించటం జరిగిందని తెలియజేసారు. అప్లికేషన్ కి చివరి తేదీ :25/5/2026 ఇతర వివరాల కోసం ఈ నెంబర్ సంప్రదించండి శేఖర్,9492559092, ప్రిన్సిపల్ సీతారామరాజు 9989004451 ఈ నెంబర్లకు కాల్ చేయాలని చెప్పారు.



## మహిళపై దాడిచేసిన ఇద్దరు వ్యక్తులు పై కేసు నమోదు.

- **ఎస్ఐ ఈ.మారుతి వెల్లడి**

**పెద్దకడుబూరు,మే 19(ప్రజాక్షేత్రం):**

కర్నూలు జిల్లా,మంత్రాలయం నియోజకవర్గం ,పెద్దకడబూరు మండలపరిధిలోని ముచ్చిగేరి గ్రామానికి చెందిన కురువ మహదేవమ్మ పై అదే గ్రామా నికి చెందిన నరసన్న,రామాంజి అనే వారు తమ అక్కతో అక్రమ సంబంధం పెట్టుకున్నట్లు మహదేవమ్మ తో సన్నిహితంగా ఉన్న విడియోను ఎవరో లింగన్న. ఎల్లప్పలకు పంపడంతో విడియోను చూసి అవమానంగా భావించి తమ పరువు పోయిందని ప్రొద్దటూరు నుండి వచ్చి మహాదేవమ్మ ను చంపితేగాని పోయిన పరువు తిరిగిరాదు అంటూ మహాదేవమ్మ ను కుడి దవడ,తలమీద ఎడమ వైపు, మెడ మీద,ఛాతీ మీద కత్తులతో నరకడం జరిగిందని అయన తెలిపారు. గాయపడిన మహదేవమ్మ ను వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్స్ లో ఆదోని ప్రభుత్వ హాస్పిటల్ కు తీసుకొని వెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ లో జి జి హెచ్ కు తీసుకెళ్లారు.మహాదేవమ్మ తండ్రి ఇచ్చిన పిర్యాదు





మేరకు యల్లప్ప, లింగన్న లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మారుతి విలేకరులకు తెలిపారు.

# పాలమూరు ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- **భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం**

**వనపర్తి,మే 19(ప్రజాక్షేత్రం):**



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులు కూడా ఆలస్యం కాకుండా తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై ప్రత్యేక దృష్టి**

**మంత్రులు,ఎమ్మెల్యేలతో సీఎం సమీక్ష**

**సమావేశం మంగళవారం హైదరాబాద్**

ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు,ఎమ్మెల్యేలతో సీఎం సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై కీలక సూచనలు చేశారు.ప్రాజెక్టుల అమలులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**భూసేకరణ నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్**

**పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం సిద్ధం**

భూసేకరణ నిధుల చెల్లింపుల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా వెంటనే నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించారు. రైతులకు, భూస్వాములకు చెల్లింపులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ**

**జిల్లా మంత్రులకు సీఎం ప్రత్యేక ఆదేశాలు**

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా మంత్రులకు సీఎం సూచించారు. సంబంధిత జిల్లా అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

**సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు**

ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు,వాకిటి శ్రీహరి,ప్రభుత్వ విప్ యేన్నం శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,టి మేఘా రెడ్డి,రాజేష్ రెడ్డి ,వంశీ క్రిష్ణ,వీర్లపల్లి శంకర్,బండ్ల క్రిష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేసిన వాకిటి అనంతరెడ్డి.

**వలిగొండ మే 19(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని అరూర్ గ్రామానికి చెందిన ఐలపాక నరసమ్మ మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి మృతి చెందిన ఐలపాక నరసమ్మ కుమారుడికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరసింహ,దామెర అంజయ్య,బుర్ర శ్రీశైలం,వేముల అనిల్ కుమార్,బోగారం ధర్మయ్య,పోలేపాక నరసింహ,బుర్ర శివ, పుట్టల కృష్ణ,నల్లరాజు,చాట నరసింహ, బొలుగుల రాజు,చాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన కుటుంబాన్ని పరామర్శించిన సిఎన్ఆర్

**వలిగొండ మే 19(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో జంగారెడ్డి పల్లి గ్రామపంచాయతీ బద్దం జగన్మోహన్ రెడ్డి కుమారుడు, ఉదయ్ కిరణ్ రెడ్డి మరణించడం జరిగింది వారి కుటుంబాన్ని పరామర్శించ అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ బిజెపి నాయకులు సి ఎన్ రెడ్డి, ప్రముఖ ప పారిశ్రాంకవేత్త పిసాటి అంజిరెడ్డి,ఆరూరు బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల బిక్షపతి యాదవ్,బోగారం రామదాసు, మైనార్టీ నాయకులు ఎండి ఫజల్ తదితరులు పాల్గొన్నారు.



## భర్తను కోల్పోయిన మహిళకు అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు

**బూర్గంపాడు,మే 19 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక రాజీవ్ నగర్ కాలనీ (గాంధీనగర్)కు చెందిన దారా సునీత భర్త దారా రాజు ఈ నెల 2వ తేదీన గుండెపోటుతో అకాల మరణం చెందడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఇద్దరు ఆడపిల్లలతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న సునీతకు చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. సారపాక గవర్నమెంట్ స్కూల్‌లో 1997 సంవత్సరంలో 7వ తరగతి కలిసి చదివిన స్నేహితులు ఈ విషాద వార్త తెలుసుకుని ఒక్కటై సునీతకు ఆర్థిక సహాయం అందించారు.అదే విధంగా రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను కూడా అందజేసి ఆమెకు ధైర్యం చెప్పారు.ఈ సహాయ కార్యక్రమంలో రఫీ, నర్సింహారావు, కుమార్,మోహన్, హరింద్ర చారి,ప్రవీణ్,సిద్ది రాజు తదితర స్నేహితులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## సభ్యత్వ నమోదులో అలసత్వం వద్దు

- **తెలంగాణ అస్తిత్వానికి ముప్పు తెచ్చే పాలనపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆందోళన**

**వనపర్తి,మే 19 (ప్రజాక్షేత్రం):**

బా రా స సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.సభ్యత్వ నమోదులో సాకులు చెప్పి అలసత్వం వహించే వారిని సహించబోమని హెచ్చరించారు.

మంగళవారంవనపర్తి జిల్లా బా రా స మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బా రా స సభ్యత్వ నమోదు ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాస్ హాజరయ్యారు.

**కార్యకర్తలే పార్టీకి బలం**

సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ పట్ల విధేయత, చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన కార్యకర్తలకు సంస్థలో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు . గత సభ్యత్వం నమోదులో వనపర్తి నియోజకవర్గంలో 70 వేల 500 సభ్యత్వాలు నమోదు చేశామని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల్లోనే ఉండే నాయకులకే పార్టీ పదవులు వస్తాయని స్పష్టం చేశారు. కార్యకర్తల శిక్షణే పార్టీకి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

**తెలంగాణ అస్తిత్వంపై ఆందోళన**

తెలంగాణ సోయి లేని పాలకుల చేతిలో రాష్ట్ర భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. అలాంటి పరిస్థితుల వల్ల తెలంగాణ అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. హామీలు విస్మరించిన నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

**రైతుల పరిస్థితిపై విమర్శలు**

రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బా రా స రాష్ట్ర కార్యదర్శి, వనపర్తి నియోజకవర్గం సభ్యత్వం ఇన్చార్జి మెట్టు శ్రీనివాస్ అన్నారు. రైతుబంధు సకాలంలో అందక రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు క్యూల్లో నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, యూరియా సరఫరాతో తెలంగాణను హరిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు.

**డిజిటల్ సభ్యత్వ నమోదు**

సభ్యత్వ నమోదు ప్రక్రియ మొత్తం డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు మెట్టు శ్రీనివాస్ తెలిపారు. బూత్ స్థాయి సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు అనంతరం సంస్థాగత ఎన్నికలు నిర్వహించి కష్టపడి పనిచేసే నాయకులకు గుర్తింపు కల్పిస్తామని చెప్పారు.

**ఓటర్ల జాబితాపై అప్రమత్తం కావాలి**

జూన్ 25 నుంచి జూలై 25 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తొలగింపులు, చేర్పులు, మార్పులు, 18 ఏళ్లు నిండిన యువత ఓట్ల నమోదు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు వాకిటి శ్రీధర్,పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్,జగదీశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి,కృష్ణానాయక్,జాత్రు నాయక్,రఘుపతి రెడ్డి,బోర్ల భీమన్న, గంధం బాలపీరు,గంధం పరంజ్యోతి,వెంకట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. మండల,పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మ్యారేజ్ బ్యూరోలకు ప్రభుత్వ గుర్తింపు కల్పించాలి

- **రాదండి వెంకటేష్**

**కరీంనగర్,మే 19 (ప్రజాక్షేత్రం):**



మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించి సహకారం అందించాలని మాటి ఏ ఏం బి ఎ మ్యారేజ్ బ్యూరో ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాదండి వెంకటేష్ కోరారు. అర్హులైన మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులకు రిస్క్ ఇన్సూరెన్స్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ వివాహ బంధం పవిత్రతను కాపాడడంలో మ్యారేజ్ బ్యూరోలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సేవా భావంతో పనిచేస్తూ మంచి గుర్తింపు కోసం నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని, సమాజంలో విశిష్ట స్థానం సంపాదిస్తున్నారని వెంకటేష్ పేర్కొన్నారు. మాతృమూర్తి దినోత్సవం సందర్భంగా ఎక్కువ పెళ్లిళ్లు జరిపించిన వారికి "ఉత్తమ మ్యారేజ్ బ్యూరో అవార్డు" అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలి లింగమూర్తి పటేల్, రాష్ట్ర కోశాధికారి ఆది హనుమంతరావు,మేకల మాధవి, ఎర్రవెల్లి ఉమాదేవి, బొంతల తిరుమలతో పాటు పలువురు మహిళా నాయకులు,మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు పాల్గొన్నారు.



## కీ!!శే!! రస్తుం ఖాన్ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు

- **తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్**



**పెద్దేముల్,మే 19 (ప్రజాక్షేత్రం):**

చలివేంద్రం ఏర్పాటుతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తి తీరుతుందని పెద్దేముల్ మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ అన్నారు.మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెద్దేముల్ గ్రామానికి చెందిన కీ!!శే!! ఎండి.రస్తుం ఖాన్ జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు ఎండి.ఆజం ఖాన్,సోదరులు ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ మాట్లాడుతూ వేసవి కాలంలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ముందుకొచ్చిన దాతలు ఎండీ.ఆజం ఖాన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు,ఆర్ఐ చంద్రశేఖర్,చలివేంద్రం దాత ఎండీ.ఆజం ఖాన్,తలారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు కారణమవుతున్న తుమ్మ చెట్టు తొలగించాలని గ్రామ ప్రజల విజ్ఞప్తి

**బూర్గంపాడు,మే 19 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, సోంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సోంపల్లి నుండి బూర్గంపాడు వెళ్ళే రోడ్డులో శ్రీగంధం తోట సమీపంలోని ప్రమాదకర మూలమలుపు వద్ద తుమ్మ చెట్టు దట్టంగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకంగా రాత్రి వేళల్లో మరియు వేగంగా వచ్చే వాహనాల సమయంలో ఈ ప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెట్టు కొమ్మలు రహదారిని కప్పివేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాద పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు సర్పంచ్,ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ కార్యదర్శికి విజ్ఞప్తి చేస్తూ, ప్రమాదం జరగకముందే వెంటనే స్పందించి తుమ్మ చెట్టు కొమ్మలను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.





## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా

**వనపర్తి,మే 19(ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు స్వీకరించిన రాజేష్ మీనా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి విధుల్లో చేరిన జిల్లా ఎస్పీ కి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాసేవలో నిబద్ధతతో ముందుకు సాగాలి**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో యువ ఐపీఎస్ అధికారిగా రాజేష్ మీనా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బాధ్యతలు చేపట్టడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల నిబద్ధత,విధుల పట్ల కర్తవ్యనిష్ఠ, సమర్థ నాయకత్వ లక్షణాలతో జిల్లా పోలీసు శాఖకు మరింత బలం చేకూరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసు శాఖ అభివృద్ధికి కృషి జిల్లా పోలీసు శాఖలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.





## ఘనంగాశ్రీనివాస్ జన్మదిన వేడుకలు

- ప్రజాసేవే ధ్యేయమన్న కార్పొరేటర్ అభ్యర్థి శ్రీనివాస్
- 277వ డివిజన్ అభివృద్ధే లక్ష్యం:దంపనబోయిన శ్రీనివాస్

**కుత్బుల్లాపూర్,మే 19 (ప్రజాక్షేత్రం):**

కుత్బుల్లాపూర్‌లో జంట నగరాల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వైఎస్‌సీపీ అధ్యక్షుడు, 277వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి దంపనబోయిన శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజుల రామారం ప్రాంతంలోని మల్లారెడ్డి నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా వివిధ కాలనీల అధ్యక్షులు, నాయకులు ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి సహాయం అందించారు. ఈ సందర్భంగా దంపనబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ 277వ డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళా సాధికారత, పారిశుధ్యం మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారం మరియు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని, డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస్ సామాజిక సేవలో ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుడుపుడి సత్తిబాబు (ఏపీ రాష్ట్ర శెట్టిబలిజ మరియు గీత కార్పొరేషన్ చైర్మన్), చెల్లుబోయిన ప్రసాద్,పితాని శ్రీనివాస్,యాంౖద లోకేశ్వరరావు, కుడుపుడి శ్రీనివాసరావు,పెచ్చిటి దేవేంద్రరావు,చింతపల్లి విడిదిసాద్,వాసంశెట్టి శ్రీనివాస్, గుత్తుల మూర్తి ,దొమ్మేటి శ్రీనివాస్, దొంగ శ్రీనివాస్,గుబ్బల వెంకటరమణ,వేంద్ర చలపతిరావు,గూడూరి త్రినాథ్, మురళీకృష్ణ,మల్లుల శ్రీనివాస్, చిట్టూరి సుబ్రహ్మణ్యం, విద్యాసాగర్,కడలి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

- భారతీయ కిసాన్ సంఘం

**పెద్ద కొడప్‌గల్,మే 19(ప్రజాక్షేత్రం):**

మండలంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘం తరపున అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రైతుల సమస్యలను గుర్తించి సహకరించిన మండల రైతులకు భారతీయ కిసాన్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మద్దతుగా మరిన్ని సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు.



## భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ అమలు చేయాలి.

- జిల్లా ప్రధాన కార్యదర్శి సి రాజు
- చలో హైదరాబాద్ గోడపత్రికలు విడుదల

**ఆత్మకూర్,మే 19 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఉన్న కార్మికులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందడం లేదని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం టి యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని మోట్లపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఈనెల 25న కార్మిక సమస్యలు పరిష్కరించాలని నిర్వహిస్తున్న. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోడ పత్రికలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భావన నిర్మాణ సంక్షేమ బోర్డు ఉన్న కార్మికులకు పూర్తిస్థాయిలో ఫలితాలు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు 9000 పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తూ ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు డెలివరీ మ్యారేజ్ గిఫ్ట్,సహజ మరణం,ప్రమాద మరణం,పథకాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు జి చెన్నయ్య,పేతురు శ్రీను,బాలకృష్ణ,శాంతన్న అనిల్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం ఇంటి ముందు గిరిజన సంఘాల నిరసన

- బంజారాహిల్స్‌లో సేవాలాల్ గుడి నిర్మాణానికి డిమాండ్
- సేవాలాల్ మహారాజ్ ఆలయానికి 100 ఎకరాల భూమి కేటాయించాలి
- మే 30న సడక్ బంద్‌కు గిరిజన సంఘాల పిలుపు

**కుత్బుల్లాపూర్,మే 19 (ప్రజాక్షేత్రం):**

లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి హైదరాబాద్ బంజారాహిల్స్‌లో 100 ఎకరాల భూమిని కేటాయించి, రూ.1000 కోట్ల నిధులు విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం ముందు గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గిరిజన విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి కుర్ర ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల జనాభా మూడో స్థానంలో ఉన్నప్పటికీ, వారి ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక దేవాలయాలకు లక్షల కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వాలు, లంబాడీల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ దేవాలయాల అభివృద్ధిపై మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నాయని విమర్శించారు. బంజారాహిల్స్ ప్రాంతం లంబాడీల చారిత్రక, సాంస్కృతిక గుర్తింపుకు ప్రతీక అని, అక్కడే జగదాంబసేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ మహారాజ్ లంబాడీల ఐక్యత కోసం కృషి చేసి, తండాలు, గూడాలను చైతన్యవంతం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో లంబాడి సమాజ హక్కుల సాధన కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. మే 30న శ్రీశైలం హైవేపై సడక్ బంద్ నిర్వహించనున్నట్లు, జూన్ 15న కొండారెడ్డిపల్లె నుంచి హైదరాబాద్ అమర వీరుల స్తూపం వరకు మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం,లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు,ప్రజా సంఘాలు,వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## సన్నతో పాటు దొడ్డు వడ్లు కూడా దించుకోవాలి

- నిరాకరిస్తే కఠిన చర్యలు
- రైస్ మిల్లర్లకు కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరిక

**వనపర్తి,మే 19(ప్రజాక్షేత్రం):**

జిల్లాలోని రైస్ మిల్లర్లు సన్న రకం వరితో పాటు దొడ్డు రకం వరి ధాన్యాన్ని కూడా తప్పనిసరిగా దించుకొని ప్రభుత్వానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు.ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 55 మిల్లులు వరి ధాన్యం కేటాయింపులకు అర్హత సాధించాయని తెలిపారు.అయితే వాటిలో కేవలం 9 మిల్లులు మాత్రమే దొడ్డు రకం ధాన్యాన్ని దించుకుంటుండగా,మిగతా మిల్లర్లు నిరాకరిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.

**ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు**

రైస్ మిల్లర్లు ఈ సీజన్‌లో రెండు రకాల వరి ధాన్యాన్ని దించుకోవాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వానికి సహకరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్లకు ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని,ప్రభుత్వం తరపున పరిష్కారానికి సహకరిస్తామని తెలిపారు.

**గోదాములు వెంటనే అందుబాటులోకి తేవాలి**

రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.జిల్లాలో ఖాళీగా ఉన్న గోదాములను ధాన్యం నిల్వకు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు.ధాన్యం నిల్వలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గోదాములను ఓపెన్ చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు.

**సమావేశంలో పాల్గొన్న అధికారులు**

సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్,జిల్లా మేనేజర్ ఆంజనేయులు, గిడ్డంగుల కార్పొరేషన్ రీజనల్ మేనేజర్,రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



## జములమ్మ దేవాలయంలో.... మాజీ చైర్పర్సన్ ప్రత్యేక పూజలు...

- జములమ్మ దేవతను దర్శించుకున్న మాజీ మున్సిపల్ చైర్పర్సన్ దంపతులు గాయత్రి రవికుమార్ యాదవ్ బీఆర్ఎస్ నాయకుడు

**ఆత్మకూరు,మే 19(ప్రజాక్షేత్రం):**

అమరచింత మండల కేంద్రంలో జరుగుతున్న జములమ్మ దేవి వారోత్సవాల సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ దంపతులు మంగళవారం జమ్మలమ్మ దేవికి అభిషేకం అర్చన నిర్వహించి అమ్మవారికి చీర సారెలను అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారు వారోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది తమ కుటుంబం ఆధ్వర్యంలో అమ్మవారిని దర్శించుకోవడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.అమ్మవారి వారోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు మంగలి నరసింహులు నాయి ప్రత్యేక ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం అమ్మవారికి ఉమ్మడి ఆత్మకూరు మండలం నుంచే కాక ఇతర మండలాల నుంచి మహిళలు భక్తులు సైతం అమ్మవారిని బోనాలతో దర్శించుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు తెలిపారు.



# దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ విజయవంతం చేయండి

- ఆత్మకూర్ తహసిల్దార్ కు మెడికల్ షాప్ అసోసియేషన్ వినపత్రం

**ఆత్మకూర్,మే 19 (ప్రజాక్షేత్రం):**

ఆత్మకూరు పట్టణంలో నేడు 24 గంటల పాటు మెడికల్ షాపుల బంద్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ అసోసియేషన్ ఆత్మకూర్ టౌన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన ఆత్మకూరు మెడికల్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ (ఏఐఓ సిడి) పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో ఈ బంద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.బంద్ కు పట్టణంలోని ప్రజలు సహకరించాలని కోరారు. ప్రధానంగా ఆన్లైన్ ద్వారా అమ్మకాలను నియంత్రించాలని, కార్పోరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నియంత్రించాలని, నకిలీ నాణ్యత లేని ఆన్లైన్ అమ్మకాలపై నిషేధం విధించాలని ప్రధాన డిమాండ్లతో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మెకు సహకరించాలని తహసిల్దార్ జీకే మోహన్,సిఐటి శివకుమార్,ఎస్సై జయన్న లకు వినతి పత్రాలను అందజేశామని



తెలిపారు.అత్యవసరంగా ఒక మెడికల్ షాపును పట్టణంలో తెరిచి ఉంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తాండూరు సుదర్శన్ శెట్టి,చెట్ల శ్రీనివాసులు, మా వచ్చి మెడికల్ స్టోర్ రంజిత్ అంత లక్ష్మి శ్రీనివాసులు అనిల్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి కామ్రేడ్ సుందరయ్య

- మొయినాబాద్‌లో ఘనంగా 41వ వర్ధంతి సభ
- సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లిన మహోన్నతుడు:అల్లి దేవేందర్

**మొయినాబాద్,మే 19 (ప్రజాక్షేత్రం):**

సొంత ఆస్తులను త్యజించి,నిరుపేదల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన త్యాగధనుడు,దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ రథసారథి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ శ్లాఘించారు.మంగళవారం మొయినాబాద్ మండల కేంద్రంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య 41వ వర్ధంతి సభను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవాంజలి ఘటించారు.అనంతరం జరిగిన సభలో అల్లి దేవేందర్ ముఖ్య వక్తగా మాట్లాడుతూ లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన అరుదైన ప్రజా నాయకుడు సుందరయ్య అని కొనియాడారు.రాజ్యసభలో మొట్టమొదటి ప్రతిపక్ష నేతగా అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ, నిరాడంబరంగా సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన ఆయన జీవనశైలి నేటి రాజకీయ నాయకులకు దిక్సూచి కావాలన్నారు.ప్రజాసేవకే తన సర్వస్వాన్ని అంకితం చేస్తూ, భవిష్యత్ తరాల కోసం పిల్లలను కూడా కనకూడదనే కఠోర నిర్ణయం తీసుకున్న మహోన్నత వ్యక్తి అని గుర్తుచేశారు.తనకు ఉన్న వందలాది



ఎకరాల భూములను నిరుపేదలకు పంచిపెట్టి భూపోరాటాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన విడిచివెళ్లిన ఆశయాల సాధన కోసమే సిపిఎం,సిఐటియు శ్రేణులు నిరంతరం కార్మిక,కర్షక పక్షాన ఉండి పోరాటాలు సాగిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ నివాళి కార్యక్రమంలో సిఐటియు మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్,భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ముంజగల ప్రభుదాస్,మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రత్నం, ప్రెసిడెంట్ సుధాకర్, నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలోకి భారీగా వలసలు

- **కార్యకర్తలకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**
- **కాంగ్రెస్,బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల నుండి చేరిన 100 మంది ముఖ్య నేతలు**
- **మొయినాబాద్ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు**

**మొయినాబాద్,మే 19 (ప్రజాక్షేత్రం):**

మండల పరిధిలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పాండురంగారెడ్డి,టీఆర్ఎస్ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు శివకుమార్ నేతృత్వంలో మంగళవారం మండలంలో భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత అందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**గులాబీ, కాంగ్రెస్, బీజేపీలకు షాక్..**

కాంగ్రెస్,బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆయా పార్టీలను వీడిన ప్రముఖులు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో బేగరి రాజు (కాంగ్రెస్), ఎండి అన్వార్ ఖాన్ (కాంగ్రెస్), మేకగూడెం బిక్షపతి (కాంగ్రెస్), షేక్ మహమ్మద్ నూర్ భాయ్ (కాంగ్రెస్), చాకలి విక్రమ్ (బీజేపీ), బొక్క సురేందర్ రెడ్డి (కాంగ్రెస్), బొక్క రవీందర్ రెడ్డి (బీఆర్ఎస్), కావలి శ్రీనివాస్ ముదిరాజ్ (కాంగ్రెస్) ఉన్నారు.

వీరితో పాటు చాకలి వినోద్ కుమార్ (కాంగ్రెస్), ఎండి ఇనుస్ (కాంగ్రెస్), మాలని రాజు (కాంగ్రెస్), గాండ్ల సంతోష్ (బీఆర్ఎస్), కుమ్మరి జనార్ధన్ (బీఆర్ఎస్), బోడ భాస్కర్ (కాంగ్రెస్), మంగలి శివ, ఎండి వినాయక్, ఎండి అలీ, ఎండి ఏయ్యా, శ్రీకాంత్ తదితరులు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులతో తరలివచ్చి చేరారు.

**ప్రజా పక్షాన నిలిచే వారికే గుర్తింపు: కల్వకుంట్ల కవిత**

ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందని నొక్కి చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలిచి పనిచేసే నాయకులకు,కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం మరియు తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.ఈ భారీ చేరికలతో మొయినాబాద్ పరిధిలో పార్టీ మరింత బలోపేతమైందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ జీఎంపై ఏసీబీ దాడులు

- **హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ జీఎంపై ఏసీబీ దాడులు**
- **రూ.5.88 కోట్ల ఆస్తుల గుర్తింపు.. రూ.1.10 కోట్ల నగదు స్వాధీనం**

**హైదరాబాద్, మే 19(ప్రజా క్షేత్రం):**

రెడ్‌హిల్స్‌లోని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ ప్రాజెక్ట్ డివిజన్8లో జనరల్ మేనేజర్ (ఇంజినీరింగ్)గా పనిచేస్తున్న సగ్గం అనంత లక్ష్మీకుమార్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. తన సర్వీసు కాలంలో తెలిసిన ఆదాయ వనరులకు మించి అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఏసీబీ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించారు. అధికారిక సమాచారం ప్రకారం, హైదరాబాద్‌లోని ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలు మరియు ఇతర సహచరులకు చెందిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ సోదాల్లో భారీ స్థాయిలో స్థిరాస్తులు, చరాస్తులకు సంబంధించిన పత్రాలు బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. సోదాల్లో నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కలిపి 18 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలు లభించాయి. అదనంగా ఆరు ఓపెన్ ప్లాట్లు, మూడు ఫ్లాట్లు, హైదరాబాద్‌లో ఓ ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు గుర్తించారు. వీటితో పాటు ఆయన నివాసంలోనే సుమారు రూ.1.10 కోట్ల నికర నగదు లభించడం సంచలనంగా మారింది. ఇక సోదాల్లో 2.1 కిలోల బంగారు ఆభరణాలు, సుమారు 9.2 కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక మారుతి రిట్జ్ కారు, బజాజ్ మోటార్‌సైకిల్‌ను కూడా గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.5,88,55,490గా ఉన్నట్లు ఏసీబీ తెలిపింది. అయితే మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన ధర కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఈ కేసును అవినీతి నిరోధక చట్టం1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద నమోదు చేసినట్లు వెల్లడించారు. గుర్తించిన ఆస్తులపై పూర్తి స్థాయి ధృవీకరణ కొనసాగుతోందని, మరిన్ని వివరాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశముందని ఏసీబీ అధికారులు తెలిపారు.



ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేసిన పక్షంలో ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106తో పాటు సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఏసీబీని సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు భూసేకరణ వేగవంతం

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం**
- **పెండింగ్ బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం సిద్ధం**
- **ఉమ్మడి జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలకు సూచించిన ముఖ్యమంత్రి**

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 19(ప్రజా-క్షేత్రం):**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులకు, ఎమ్మెల్యేలకు స్వయంగా సూచించారు. మంగళవారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యేలు జి మధుసూదన్ రెడ్డి జిఎంఆర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, రాకేష్ రెడ్డి, వంశీకృష్ణ, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం పేర్కొన్నారని మంత్రులు, ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఇతర సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మంత్రులు ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.జిల్లాలో సమస్యల పరిష్కారం పనుల్లో పురోగతిపై మంత్రుల ఆధ్వర్యంలో తరచూ తనను కలవాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టు తీరుపై స్పందించి భూసేకరణ వాటికి చెల్లించాల్సిన బిల్లులతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేయడం ఎంతో శుభ పరిణామం అని తెలిపారు.




# ఇంధన ధరలు పెంపుపై వైఎస్ఆర్సిపి డ్రామాలు ప్రజల నమ్మరు..!

- **రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి విభాగం నరవ రమాకాంత్ రెడ్డి నరవ శశిరేఖ డిమాండ్**

**పెద్ద కడుబూర్ మే 19(ప్రజాక్షేత్రం):**



పెద్దకడబూరు మండలం పరిధిలోని రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి విభాగం నరవరామకాంత్ రెడ్డి కర్నూలు జిల్లా పార్లమెంట్ సభ్యురాలు శశిరేఖ వారి స్వగృహమునందు విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా తొలి రెండు సంవత్సరాల్లోనే రికార్డు స్థాయిలో లీటర్ పెట్రోల్ పై 31 రూపాయలు, లీటర్ డీజిల్ పై 31 రూపాయలు పెరిగింది. రోడ్డు చెస్ పేరుతో, విఏ టి పేరుతో మూడుసార్లు ధరలు పెంచారు. కరోనా సమయంలో అన్ని రాష్ట్రాలు డీజిల్, పెట్రోల్ పై పది రూపాయల తగ్గిస్తే మీరు మాత్రం తగ్గించలేదు. కరెంటు చార్జీలు పెంచి, చెత్త పన్నులు వేసి నడ్డి విరిచి, బాదుడే బాధడు బాదిన మీరు, ఇప్పుడు ధర్నాలు చేయడము హాస్యస్పదము. మా ఎన్ డి ఏ పాలనలో జిఎస్టి తగ్గించి ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 15000 ఆదా చేసిన ఘనత మాది, మీ హాయంలో మీరు ఆరుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే మా ప్రభుత్వం ఇప్పటివరకు విద్యుత్ ఛార్జీలు పెంచకపోగా విద్యుత్ కొనుగోలులో 100కోట్లు ఆదా చేసి వినియోగదారులకు పంచిన ఘనత మాది, మా ప్రభుత్వాని ది, మీరు ఇలాంటి ధర్నాలు ఎన్ని చేసినా ప్రజలు మిమ్మల్ని నమ్మరు.మీ పార్టీ మనుగడకు మీరు చేసే డ్రామాలు మానుకోండి మానుకోండి అని సవాలు ఇస్తారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఎస్సీఆర్పీఎస్ నాయకుడు మృతి

**శంకర్ పల్లి మే 19(ప్రజాక్షేత్రం):**



శంకర్ పల్లి మండలం, జన్వాడ గ్రామానికి చెందిన షెడ్యూల్డ్ క్యాస్ట్స్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ నాయకుడు అంతిగల్ల రాజు (41) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 7 గంటలకు చేతిలో నొప్పి వస్తుందని చెప్పగా వెంటనే శంకర్ పల్లి లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు అక్కడినుండి గచ్చిబౌలి లోని కాంటినెంటల్ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 9 గంటలకు తుది శ్వాస విడిచారు. మృతుడికి కూతురు, కుమారుడు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంతిగల రాజు మృతితో ఆయన కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. గ్రామంలో ఎవరికి సమస్య వచ్చినా తన సమస్యగా భావించి స్పందించే వారిని, అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమని గ్రామస్తులు తెలిపారు. అశ్రునయనాల మధ్య మంగళవారం సాయంత్రం ఆయన స్వ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.




# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి : సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, మే 19(ప్రజా క్షేత్రం) :**

ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి బాధితులకు న్యాయం చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని టౌన్5 పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ కి పోలీస్ అధికారులు, సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్, భద్రతా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఫిర్యాదుల నమోదు విధానాన్ని సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి గౌరవం ఇచ్చి, వారి సమస్యలను ఓర్పుతో వినాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లో పెండింగ్ కేసుల దర్యాప్తు, బీట్ డ్యూటీ వ్యవస్థ, రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా వంటి అంశాలను సీపీ సమగ్రంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ముఖ్యంగా అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణతో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్‌ను ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే వారి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టౌన్5 పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్నందున, వివిధ పాఠశాలలు, కళాశాలలు, సోషల్ మీడియా వేదికగా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్స్, గేమింగ్ యాప్‌ల బారిన పడి, సైబర్ మోసగాళ్ల చేతిలో చిక్కి అప్పులపాలై ప్రాణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి గేమింగ్ యాప్‌ల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారులుగా విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అక్కడి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పైఅధికారులకు చేరవేయాలని కమిషనర్ సూచించారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతరం హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పోలీసులు బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ బి.ప్రకాష్ యాదవ్, నార్త్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ బి.అంజయ్య, టౌన్5 ఎస్ఐ






# కాలనీ భద్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**చర్లపల్లి, మే 19 (ప్రజా క్షేత్రం):**

కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్ కాలనీలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ సురక్ష' అవగాహన కార్యక్రమంలో ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్ పాల్గొని కాలనీ వాసులకు భద్రతా సూచనలు వివరించారు. చర్లపల్లి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో ప్రతి ఇంటిలో పనిచేసే పనివారు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లు, కార్మికుల పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని డీసీపీ తెలిపారు. 'సురక్ష' గూగుల్ ఫారం ద్వారా వారి వివరాలను పోలీసులకు అందజేస్తే ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడం సులభమవుతుందని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని ఉప్పల్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ సూచించారు. కార్యక్రమంలో మేడిపల్లి ఏసీపీ మోహన్ కుమార్, చర్లపల్లి ఎస్‌హెచ్‌వో సుధాకర్, ఎస్సై వంశీ, హెడ్ కానిస్టేబుల్ భాస్కరాచారి, కానిస్టేబుళ్లు మధు, రాజేష్ పాల్గొన్నారు. అలాగే ఈసీ నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు బి. శ్రావణ్ కుమార్, డైరెక్టర్ బిక్షపతి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్, కార్యదర్శి గోపాలకృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి జి. హరిప్రసాద్, మహిళా సంఘం అధ్యక్షురాలు వి. లక్ష్మితో పాటు కాలనీ వాసులు హాజరయ్యారు.

# కౌట(బి)అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక..

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 19(ప్రజా క్షేత్రం ):-**

బోథ్ మండలంలోని కౌట బి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులు కాడి రాజేందర్ ఉపాధ్యక్షులు:బిక్క గంగాధర్ కోశాధికారి:కామేర శేఖర్ ప్రధాన కార్యదర్శి:జొన్నలసాయన్న సంయుక్త కార్యదర్శి:రాళ్లబండి శ్రావన్ కార్యవర్గ సభ్యులుగ నల్ల హరికాంత్, మాకునూరి రాజు, బిక్క నవీన్ బెక్కం రాజు, పాలెప్ గంగయ్య పొన్న కంటి జైపాల్ ,గోలి భూషణ్ ఎన్నుకోవడం జరిగింది.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
20.05.2026
బుధవారం | హైదరాబాద్

# ఏసీబీ వలకు జలమండలి అవినీతి తిమింగలం..

- రూ.1.10 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం
- హైదరాబాద్ వాటర్ బోర్డ్ జీఎం ఎస్.ఎల్. కుమార్ ఇళ్లపై ఏసీబీ దాడులు
- సోదాల్లో రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారం, ఆస్తి పత్రాల స్వాధీనం
- హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 8 చోట్ల ఏకకాలంలో సోదాలు
- మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.100 కోట్లు ఉండొచ్చని అధికారుల అంచనా
- కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న ఏసీబీ అధికారులు

**హైదరాబాద్ బ్యూరో మే 19(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్‌లోని మెట్రో వాటర్ సప్లై అండ్ మురుగునీటి పారుదల బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)లో భారీ అవినీతి బట్టబయలైంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా ఆరోపణలతో వాటర్ బోర్డ్ రెడ్ హిల్స్ విభాగం జనరల్ మేనేజర్ (జీఎం) ఎస్.ఎల్. కుమార్‌కు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు లభించడంతో అధికారులు సైతం విస్తుపోయారు. ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. మంగళవారం ఉదయం ప్రారంభమైన ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పలు కీలకమైన ఆస్తి పత్రాలను కూడా సీజ్ చేశారు. హైదరాబాద్ మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో నగదును లెక్కించి, బంగారు ఆభరణాలను సీల్ చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఏసీబీ ప్రాథమిక అంచనా ప్రకారం కుమార్ ఆస్తుల విలువ మార్కెట్‌లో సుమారు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని అనుమానిస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీలలో మూడు ఫ్లాట్లు, ఆరు ఓపెన్ ప్లాట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. దీంతో పాటు కొన్ని కార్లు కూడా ఆయన పేరు మీద ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఎస్.ఎల్. కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఈ ఆస్తుల వెనుక ఉన్న



ఆదాయ వనరులపై లోతుగా ప్రశ్నిస్తున్నారు. ఆయనకు సంబంధించిన బ్యాంకు లాకర్లను కూడా తెరిచి తనిఖీ చేయనున్నారు. గతేడాది డిసెంబర్‌లోనూ రవాణా శాఖకు చెందిన డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ కేసులో ఏసీబీ సుమారు రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వాటర్ బోర్డ్ అధికారి కేసులోనూ అదే స్థాయిలో ఆస్తులు బయటపడటం తెలంగాణలో కలకలం రేపుతోంది. ఈ సోదాలపై పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు సాయంత్రం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



## శంకర్‌పల్లిలో వర్ష బీభత్సం

- చెట్లు విరిగి కరెంటు సరఫరాకు అంతరాయం

**శంకర్‌పల్లి, మే 19(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో సోమవారం కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. దాదాపు రెండు గంటల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లు కూడా తెగిపడి విద్యుత్ లైన్లపై పడటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. భారీ గాలులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వర్ష ప్రభావంతో రహదారులపై చెట్లు కూలిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది, వార్డు సభ్యులు వెంటనే ఘటనాస్థలాలకు చేరుకుని చెట్లు, పోస్టర్ల తొలగింపు పనులు చేపట్టారు. విద్యుత్ శాఖ సిబ్బంది దెబ్బతిన్న లైన్ల మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. పలు ప్రాంతాల్లో ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదని అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మొబైల్ ఫోన్లను అవసరమైనప్పుడే వినియోగించాలని, పవర్ బ్యాంకులను సిద్ధంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.



## పెద్దపల్లి జిల్లాలో కుల వివక్ష కలకలం.. 20 మందిపై అట్రాసిటీ కేసు!

**పెద్దపల్లి మే 19(ప్రజాక్షేత్రం):**

పెద్దపల్లి జిల్లాలోని కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో తీవ్ర కలకలం రేపిన కుల వివక్ష ఘటనపై పోలీసులు వేగంగా స్పందించారు. తమను కులం పేరుతో దూషించి, అవమానించారంటూ ఓ దళిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో ఏకంగా 20 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన వివరాల్లోకి వెళితే..కాల్వ శ్రీరాంపూర్ మండలానికి చెందిన ఆసంపల్లి స్వరూప అనే దళిత మహిళను ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో కొంతమంది వ్యక్తులు కులం పేరుతో దూషించడమే కాకుండా, వివక్ష పూరితంగా వ్యవహరించారు. దళిత మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.బాధితురాలి ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన కాల్వ శ్రీరాంపూర్ ఎస్ఐ వెంకటేష్ ఘటనకు కారణమైన 20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు.

**పోలీసుల స్పందన**

ఈ ఘటనపై కాల్వ శ్రీరాంపూర్ పోలీసులు స్పందిస్తూ.. "కుల వివక్ష, వేధింపుల వంటి చర్యలను ఎంతమాత్రం సహించేది లేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నాం. బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" ఎస్సై వెంకటేష్ తెలిపారు.




## కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**చేవెళ్ల, మే 19(ప్రజాక్షేత్రం):**



విదేశాలతో పోల్చితే మన వద్ద పెట్రోల్, డీజిల్ తక్కువ పెరిగిందని, పెట్రోల్ ధరలపైన మాట్లాడానికి కాం గ్రెస్‌కు హక్కు లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 5 లక్షల కోట్ల ఆయిల్ బాండ్స్ అమ్మిందని చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని మోదీ ముందుగానే చెప్పారని, యుద్ధం జరిగితే పెట్రోల్ రేట్లు పెరుగుతాయన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవా రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ వచ్చిన తర్వాత ఆ బాండ్స్ అన్ని బీజేపీ కడుతుందని, వాటికి వడ్డీతో సహా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. తెలంగాణలో పాత సీఎం కేసీఆర్ పెంచారు, కొత్త సీఎం రేవంత్ రెడ్డి రేట్లను పెంచారన్నారు. మహారాష్ట్రలో రూ.109, గుజరాత్ రూ. 98.30, ఢిల్లీలో రూ.97, తెలంగాణలో రూ.111.88 ఉందన్నారు.

## రూ.1000 లంచానికి లక్ష బహుమతి.. సీఎం విజయ్ సంచలన నిర్ణయం

**నేషనల్ బ్యూరో మే 19(ప్రజాక్షేత్రం):**



ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పూర్తిగా నిర్మూలించడానికి తమిళనాడు ప్రభుత్వం ఒక సరికొత్త విప్లవాత్మక ప్రోత్సాహక పథకాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ నూతన విధానం ప్రకారం రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ శాఖలోనైనా సరే అధికారులు లేదా సిబ్బంది మీ నుండి కేవలం 1000 రూపాయల లంచం డిమాండ్ చేసినా పౌరులు సాక్ష్యాధారాలతో స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చు. లంచాలు అడిగే అధికారులపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసి అవినీతి నిరోధక శాఖకు పట్టిచ్చిన పౌరులకు ప్రభుత్వం తరపున ఏకంగా 1,00,000 రూపాయల నగదు బహుమతి ఇస్తామని ముఖ్యమంత్రి సంచలన ప్రకటన చేశారు. ఈ అవినీతి నిరోధక ఫిర్యాదుల కోసం 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1800 425 1555 అనే ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ప్రభుత్వం రంగంలోకి దించింది. సామాన్య ప్రజలను నేరుగా భాగస్వాములను చేస్తూ తమిళనాడు సర్కార్ తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పథకం ద్వారా లంచగొండితనానికి పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని, నిరుపేదలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## న్యాయం కోసం వెళ్తే అన్యాయం.. వివాహితను గర్భవతిని చేసిన ఖమ్మం సీఐ

- భర్తపై ఫిర్యాదుకు వచ్చిన మహిళను లోబర్చుకున్న సీఐ రాజు నాయక్
- పెళ్లి పేరుతో గర్భవతిని చేసి, బలవంతంగా అబార్షన్ చేయించిన వైనం
- బాధితురాలి ఫిర్యాదుతో సీఐపై కేసు నమోదు, ముందస్తు బెయిల్
- విచారణలో ఆరోపణలు నిజమేనని తేలడంతో డీజీపీ ఆఫీస్‌కు అటాచ్

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

ఖమ్మం కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీఐ భూక్యా రాజు నాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. భర్తపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ మహిళను పెళ్లి పేరుతో లోబర్చుకుని, గర్భవతిని చేసి, వేధించినట్లు ఆయనపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ కేసులో ప్రాథమిక విచారణలో ఆరోపణలు నిజమేనని తేలడంతో రాజు నాయక్‌పై బదిలీ వేటు పడింది. 2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో రాజు నాయక్ సీఐగా ఉండగా ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు నుంచి ఫోన్ నంబర్ తీసుకున్న సీఐ, న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్లు, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే, సీఐ ఆమెకు బలవంతంగా కొన్ని ట్యాబ్లెట్లు మింగించడంతో గర్భస్రావం అయిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత కూడా పెళ్లి విషయాన్ని దాటవేస్తుండటంతో విసిగిపోయిన ఆమె ఈ నెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు కావడంతో సీఐ రాజు నాయక్ పరారీలోకి వెళ్లి, ఇటీవల ముందస్తు బెయిల్ పొందినట్లు సమాచారం. మరోవైపు, ఈ ఘటనపై జరిగిన అంతర్గత విచారణలో సీఐ వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు అతడిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. బాధితురాలికి ఇటీవలే ఆమె భర్త నుంచి కోర్టు ద్వారా విడాకులు మంజూరయ్యాయి. ఆమెకు విడాకులు ఇప్పించేందుకు సీఐ రాజు నాయక్ ఆమె భర్తపై ఒత్తిడి తెచ్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.





## ప్రభుత్వాసుపత్రిలో సైకో వీరంగం

- ఘట్‌కేసర్‌లో సైకో హల్‌చల్.. నర్సుపై దాడి

**ఘట్‌కేసర్, మే 19 (ప్రజా క్షేత్రం):**

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు సైకోలా ప్రవర్తిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో బీభత్సం సృష్టించాడు. ఆసుపత్రిలో ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు విధుల్లో ఉన్న మహిళా నర్సుపై దాడి చేశాడు. అడ్డుకునేందుకు వచ్చిన స్థానికులపై కూడా దాడికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం సుమారు 24 ఏళ్ల యువకుడు ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వద్ద రైలు కింద పడతానంటూ హడావుడి చేశాడు. తలకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తనను బతికించాలని, లేదంటే చంపేస్తానంటూ అక్కడి సిబ్బందిని బెదిరించాడు. ఈ క్రమంలో విధుల్లో ఉన్న నర్సు జుట్టు పట్టుకుని పై అంతస్తు నుంచి కిందికి లాక్కొచ్చాడు.

యువకుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన స్థానికులపై కూడా అతడు ఎదురు దాడికి దిగాడు. ఆసుపత్రిలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తూ భయాందోళనకు గురిచేశాడు. అనంతరం రోడ్డుపైకి పరుగెత్తగా, వెంటపడిన స్థానికులు అంబేద్కర్ విగ్రహం వద్ద అతడిని పట్టుకుని కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దాడిలో గాయపడిన నర్సు, మరో ఇద్దరికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. స్థానికుల దాడిలో గాయపడిన యువకుడిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతడు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చాడు? అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





## అక్రమంగా అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్.. వేం నరేందర్ రెడ్డి మైనింగ్

- మన్నె క్రిషాంక్

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

భూ భారతి పేరిట కాంగ్రెస్ నాయకులు అసైన్డ్ భూములు కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిషాంక్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల్లో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి మైనింగ్ చేస్తున్నాడన్నారు. 2010లో, 2015లో వేం నరేందర్ రెడ్డి ఎలక్షన్ అఫిడవిట్‌లో అసైన్డ్ భూముల గురించి ఎక్కడా లేదు.. కానీ 2026లోని ఎలక్షన్ అఫిడవిట్‌లో వాటి వివరాలున్నాయన్నారు. వేం నరేందర్ రెడ్డి భార్య విజయ లక్ష్మి పేరు మీద ఉన్న శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ కింద ఈ భూములు ఉన్నాయి. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల సర్వే నంబర్, శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ ఉన్న భూములు ఒకటే సర్వే నంబర్ కింద ఉన్నాయని స్పష్టం చేశారు. అవి అసైన్డ్ భూములని ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ సంతకాలు కూడా ఉన్నాయి. ఇందులో కచ్చితంగా పాత మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రాత్ర కూడా ఉందని.. అందుకే వేం నరేందర్ రెడ్డి రాజ్య సభకి పోతు.. నువ్వు కూడా నా వెంట రా అని కలెక్టర్‌కి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో స్పెషల్ సెక్రటరీ పదవి ఇప్పించాడని మన్నె క్రిషాంక్ ఆరోపించారు. వేం నరేందర్ రెడ్డి అక్రమంగా అసైన్డ్ భూములు కాజేస్తున్నాడు. తన కొడుకు వేం కృష్ణ భార్గవ్ రెడ్డి పేరిట అక్రమంగా అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాడని భూ భారతి ద్వారా అన్ని ఆధారాలు సేకరించానని మన్నె క్రిశాంక్ తెలిపారు.



## సినిమా ఛాన్స్ పేరిట యువతిపై లైంగిక దాడి

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**



జూబ్లీహిల్స్ నుండి ఒక సినిమా షూటింగ్ సాకుతో తీసుకెళ్లి సికింద్రాబాద్‌లో ఇద్దరు వ్యక్తులు ఒక మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మంగళవారం నాడు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం, బాధితురాలు, ఆమె స్నేహితురాలు యూసుఫ్‌గూడలోని జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో నివసిస్తూ, సినిమాలలో బ్యాక్‌గ్రౌండ్/జూనియర్ నటులుగా పని చేస్తుంటారు. ఒక వ్యక్తి బాధితురాలిని సమీపించి, సినిమా షూటింగ్ ఉందని చెప్పి, తనతో పాటు రమ్మని అడిగాడు. అతని మాట నమ్మి, ఆమె అతనితో పాటు సికింద్రాబాద్‌కు వెళ్ళింది. అక్కడ, ఆ వ్యక్తి, అతని స్నేహితుడు ఒక గదిలో రెండు రోజులకు పైగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మే 16న, నిందితులు ఒక రాపిడో బైక్‌ను బుక్ చేసుకుని, ఆ మహిళను తిరిగి ఇంటికి పంపించారు. ఆమె స్నేహితురాలు ఆమె శరీరంపై ఉన్న గాయాలను గమనించి, చికిత్స నిమిత్తం ఆమెను గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్య పరీక్షల సమయంలో, బాధితురాలు వైద్యులకు తనపై జరిగిన దాడి గురించి వివరించారు. దీని అనంతరం, ఆమె జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వారిని గుర్తించి పట్టుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు. తదుపరి విచారణ కొనసాగుతోంది.

## మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు.. వారంలో రెండోసారి

**న్యూఢిల్లీ మే 19(ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వ రంగ చమురు సంస్థలు దాదాపు నాలుగేళ్లుగా ధరల సవరణలపై విధించిన నిలిపివేతను ఎత్తివేసిన నేపథ్యంలో ఒక వారంలోపే ఇంధన ధరలు పెరగడం ఇది రెండోసారి కాగా, మంగళవారం నాడు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు సుమారు 90 పైసలు పెరిగాయి. పరిశ్రమ వర్గాల ప్రకారం, ఈ పెంపు కారణంగా న్యూఢిల్లీలో పెట్రోల్ ధరలు లీటరుకు రూ. 97.77 నుండి రూ. 98.64కు పెరగగా, డీజిల్ ధరలు రూ. 90.67 నుండి రూ. 91.58కు చేరాయి. ఇరాన్ యుద్ధం తరువాత ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరగడంతో, కీలకమైన రాష్ట్ర ఎన్నికల సమయంలో నెలల తరబడి ధరలను స్థిరంగా ఉంచిన ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు, తమ పెరుగుతున్న నష్టాలలో కొంత భాగాన్ని వినియోగదారులపై మోపవలసి వచ్చింది. దీంతో, నాలుగు సంవత్సరాలకు పైగా కాలంలో మొదటిసారిగా శుక్రవారం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 3 మేర పెంచారు. తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.111.36కి, లీటర్ డీజిల్ రూ.99.53 చేరింది. అటు విజయవాడలో లీటర్ పెట్రోల్ రూ.114.48, లీటర్ డీజిల్ రూ.102.17 పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## పెద్ద కొడప్‌గల్‌లో సైనిక్ స్కూల్ అడ్మిషన్ ప్రారంభం

- **నాణ్యమైన విద్య అందిస్తున్నాం**
- **కరస్పాండెంట్ యం.సాయిలు**

**పెద్దకొడప్‌గల్, మే 19(ప్రజాక్షేత్రం)**

మండల కేంద్రంలోని సైనిక్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో విద్యా సంవత్సరానికి సంబంధించిన నూతన అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎం. సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల బృందం మండల కేంద్రంలోని పలు కాలనీలు, వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రచార కార్యక్రమం నిర్వహించింది. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఉత్తమ బోధన అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే సైనిక్ విధానంలో విద్యాబోధన ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి భావాలు పెంపొందేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్యార్థుల సర్వాంగీణ అభివృద్ధే పాఠశాల ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఆర్సీబీ ఫిజియోథెరపిస్ట్ స్టోరీ అంతా డూపే.. హేజిల్‌వుడ్, లివింగ్‌స్టోన్ ఏం చేయలేదు!

**ప్రజాక్షేత్రం:**

ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు సంబంధించిన ఓ భావోద్వేగ కథ తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఎమిలీ' అనే మహిళా ఫిజియోథెరపిస్ట్ చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి.. క్లీనర్‌గా పనిచేసి.. తర్వాత ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ సిఫారసుతో ఆర్సీబీ జట్టులో ఉద్యోగం సంపాదించిందంటూ పలు పోస్టులు నెట్టింట చక్కర్లు కొట్టాయి. అయితే ఈ ఎమిలీ స్టోరీ పూర్తిగా కల్పితమని తాజాగా ఫ్యాక్ట్ చెక్‌లో తేలింది. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. ఎమిలీ అనే మహిళ ఆర్సీబీ జట్టులోనే లేదు.

వైరల్ అవుతున్న పోస్టుల ప్రకారం.. బెంగళూరు మ్యాచ్‌ల సమయంలో మైదానంలోకి ఫిజియోగా వచ్చే ఈమె మీకు తెలుసా?, ఆమె జీవితం ఒక సినిమా కథకు పోటీ ఇవ్వగలదు అంటూ పెద్ద ఇంట్రడక్షన్ ఇచ్చారు. ఆమె పేరే ఎమిలీ. పద్నాలుగేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆమె.. చదువు ఖర్చుల కోసం ఒక గ్రంథాలయంలో ఉద్యోగంలో చేరింది. ఆపై ఆస్ట్రేలియాలోని ఒక క్రికెట్ అకాడమీలో స్వీపర్‌గా పనిచేస్తూ జీవనం కోసం పోరాడింది. అక్కడ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహిళా క్రికెటర్ల కంటే.. మహిళా ఫిజియోలే ఎమిలీ దృష్టిని ఆకర్షించారు. రోజంతా పనిచేసినా ఇంటి అద్దె కూడా కట్టడానికి సరిపోని పరిస్థితుల్లో.. ఆమె ఫిజియోథెరపీ చదవాలని నిర్ణయించుకుంది. కేవలం తన సంకల్ప బలంతో ఒక ఫిజియోగా మారింది.






ఆ సమయంలోనే ఎమిలీ ఒక స్థానిక క్రికెటర్‌తో ప్రేమలో పడి పెళ్లి చేసుకుంది. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చాక జీవితం అందంగా మారుతుందని భావించినప్పటికీ.. విధికి వక్రీకరించింది. ఆమె భర్త క్రికెట్‌లో రాణించలేకపోవడంతో.. మద్యంకు బానిసవ్వడంతో కుటుంబం విచ్ఛిన్నమైంది. భర్త వదిలిపోయినా.. పిల్లల కోసం పోరాటం చేసింది. ఆ సమయంలో ఒక శిక్షణా శిబిరంలో ఆసీస్ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ఒక కాంతి కిరణంలా ప్రవేశించాడు. ఆమె ప్రతిభను, జీవిత పోరాటాలను గుర్తించి.. ఆమెను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యానికి పరిచయం చేశాడు. ఎమిలీ పోరాట గాథ విన్న ఆర్సీబీ.. గత సీజన్‌లో తమ ఫిజియో బృందంలోకి సాదరంగా ఆహ్వానించింది. ఈ రోజు తన కాళ్ళ మీద తాను నిలబడింది. ఈ కథను చాలామంది సోషల్ మీడియాలో భావోద్వేగంతో షేర్ చేశారు. ఓ పోస్టుకు ఇంగ్లాండ్ స్టార్ ఆటగాడు లియామ్ లివింగ్‌స్టోన్ లైక్ కొట్టాడు. అయితే ఈ స్టోరీలు ఎలాంటి నిజం లేదని స్పష్టమైంది.

ఫ్యాక్ట్ చెక్ ప్రకారం.. ఆర్సీబీ మెడికల్ లేదా ఫిజియో టీమ్‌లో ఎమిలీ మహిళ ఎవరూ లేరు. ప్రస్తుతం ఆర్సీబీ అధికారిక ఫిజియోథెరపిస్ట్‌గా టమారా జ్వెక్ పని చేస్తున్నారు. అలాగే వైరల్ కథలో చెప్పిన సంఘటనలు ఎక్కడా జరగలేదని నిర్ధారణ అయింది. సోషల్ మీడియాలో ఎక్కువ వ్యూస్, షేర్ల కోసం సృష్టించిన కల్పిత స్టోరీగా దీన్ని గుర్తించారు. ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ఈ సీజన్‌లో ఆర్సీబీ జట్టులో భాగమైనప్పటికీ.. ఎలాంటి సిఫారసు చేయలేదట. అతడికి ఈ కథతో ఎలాంటి సంబంధం లేదని కూడా స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ఫేక్ స్టోరీపై అభిమానులు సోషల్ మీడియాలో తమదైన శైలిలో స్పందిస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా పోస్టులు షేర్ చేయొద్దని నెటిజన్లు సూచిస్తున్నారు.

## బీసీసీఐ ప్రభుత్వ సంస్థ కాదు.. కేంద్ర సమాచార కమిషన్ కీలక తీర్పు

- **ఆర్టీఐ పరిధిలోకి బీసీసీఐ రాదని తేల్చిచెప్పిన సీఐసీ**
- **ప్రభుత్వం నుంచి బీసీసీఐ ఎలాంటి నిధులు పొందడం లేదని వెల్లడి**
- **చట్టప్రకారం ఏర్పాటైన సంస్థ కానందునే ఈ నిర్ణయం**
- **గీతా రాణి అనే మహిళ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసిన కమిషన్**




**ప్రజాక్షేత్రం:**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పరిధిలోకి రాదని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) కీలక తీర్పు వెలువరించింది. బీసీసీఐ చట్టప్రకారం ఏర్పాటైన సంస్థ కాదని, ప్రభుత్వం నుంచి గణనీయమైన నిధులు పొందడం లేదని, ప్రభుత్వ నియంత్రణలో కూడా లేదని స్పష్టం చేసింది. అందువల్ల ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 2(h) ప్రకారం దీనిని 'ప్రభుత్వ యంత్రాంగం'గా పరిగణించలేమని తేల్చిచెప్పింది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడానికి, జట్టును ఎంపిక చేయడానికి బీసీసీఐకి ఉన్న అధికారం గురించి గీతా రాణి అనే మహిళ 2017లో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు ఆర్టీఐ దరఖాస్తు చేశారు. దీనిపై మంత్రిత్వ శాఖ తమ వద్ద సమాచారం లేదని, బీసీసీఐని ప్రభుత్వ యంత్రాంగంగా ప్రకటించనందున ఈ దరఖాస్తును బదిలీ చేయలేమని బదులిచ్చింది. దీంతో ఆమె సీఐసీని ఆశ్రయించారు.

ఈ అప్పీల్‌పై సోమవారం విచారణ జరిపిన సమాచార కమిషనర్ పి.ఆర్. రమేశ్, గీతా రాణి పిటిషన్‌ను కొట్టివేశారు. విచారణ సందర్భంగా బీసీసీఐ తమ వాదనలు వినిపించింది. తాము తమిళనాడు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక ప్రైవేట్ స్వయంప్రతిపత్తి గల సంస్థ మాత్రమేనని, ప్రభుత్వ నియంత్రణ, యాజమాన్యం లేదా నిధులపై ఆధారపడలేదని వివరించింది.

ఈ వాదనలతో ఏకీభవించిన సీఐసీ, బీసీసీఐ సొంతంగా మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టిక్కెట్ల అమ్మకాల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటూ ఆర్థికంగా స్వతంత్రంగా ఉందని పేర్కొంది. గతంలో లోధా కమిటీ సంస్కరణల విషయంలో సుప్రీంకోర్టు బీసీసీఐని 'ప్రజా ప్రాముఖ్యత' ఉన్న సంస్థగా గుర్తించినప్పటికీ, ఆర్టీఐ చట్టం ప్రకారం దానిని 'ప్రభుత్వ యంత్రాంగం'గా ప్రకటించలేదని సీఐసీ గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో, గీతా రాణి దాఖలు చేసిన అప్పీల్‌లో పసలేదని పేర్కొంటూ కమిషన్ దానిని కొట్టివేసింది.

## ఆలయంలోకి రానివ్వడంలేదని రోడ్డెక్కిన దళితులు

**కాల్వశ్రీరాంపూర్ మే 19(ప్రజాక్షేత్రం):**

తమను ఆలయంలోకి రానివ్వడం లేదని దళితులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగిన సంఘటన కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన దళితులు బోనాలతో ఎల్లమ్మ తల్లి ఆలయానికి మొక్కులు చెల్లించేందుకు వెళ్లగా, గౌడ సంఘం సభ్యులు కొందరు గుడిలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని దళితులు మండిపడ్డారు. కుల వివక్షతో తమను అడ్డుకున్నారని బోనాలతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తూ దళితులను కులవివక్ష పేరుతో చిన్నచూపు చూస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని పలువురు దళిత సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## వాట్సాప్ మీసేవలో మరిన్ని జిహెచ్ఎంసి సేవలు

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**




జిహెచ్ఎంసికి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్(ఇంటి దగ్గర పుట్టిన), డెత్ హోమ్(ఇంటి దగ్గర చనిపోయిన), ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. ఈ సేవలు పొందేందుకు మీసేవా తెలంగాణ వాట్సాప్ నెంబర్ 8096958096కు 'Hi' అని మెసేజ్ పంపించాలి. అనంతరం అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే 'Open Service' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394